# వ్యంగ్యాస్త్రాలు



సిహెచ్. వి.ఎస్. ఎన్. మూర్తి

# Index


వ్యంగ్యాస్త్రాలు  --  03, 04, 05

మీ బరువు ఎంత!!!  --  06

అమాయకత్వం భయపడి పారిపోయింది!!!  --  07, 08, 09

తల బద్దలు కొట్టుకున్నా కొన్నిప్రశ్నలకి సమాధానం దొరకదు!!  --  10, 11

“అవసరం, ఉపయోగం, వాడుకోవడం”!  --  12, 13

"వన్ ఐడియా కెన్ చేంజ్ యువర్ లైఫ్"  --  14, 15,  16

ఎవరో చెప్పారని, ఏదో చదివాము అని మారిపోతామా  --  17, 18

తెలుగు వ్యాకరణం- మన పాండిత్యగరిమ  --  19, 20, 21

అయినా పర్వాలేదు!!!  --  22, 23

అప్పిచ్చువాడు, వైద్యుడు  --  24, 25

తెలుగువాడి గుర్తులు,మారుతున్న నమూనాలు!!!  --  26, 27

మేలుకొలుపు  --  28

చతుర్ముఖ పారాయణం  --  29

"భార్యా రూపవతి శత్రువు"!!!  --  30, 31

“డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.దేవుడి.కామ్”  --  32, 33

"గూగుల్ "దెబ్బ అందరూ అబ్బా!!!   --  34, 35

దానికి జనం ఉన్నారు కదా...  --  36, 37

“ఎవరి పాపానికి వాళ్ళు పోతారు”  --  38, 39, 40, 41

సోషల్ మీడియాలో బతికేయడం  --  42, 43

అంతలో ఇంత తేడా -ఇలా అయిపోయాయి!!!  --  44, 45

టెట్రా ప్యాక్  --  46, 47

విరుపులు- వెటకారాలు

# వ్యంగ్యాస్త్రాలు

**ఆయ్.... వెటకారమేనండి**

పని మీద...

మనసు లగ్నం చేయడం!

ధ్యాస పెట్టి చేయడం!

దృష్టి పెట్టి చేయడం!

ఏకాగ్రతతో చేయడం!

మనసుపెట్టి చేయడం!

ఆర్తిగా పనిచేయడం!

యాంత్రికంగా చేయడం!

అలాకాకుండా ఇవేవీ కాకుండా ఏదో పని అయిపోయింది అన్నట్టుగా -ఆ పనులు పూర్తి చేయడం!

ఇందులో మీరు ఏకోవకు చెందుతారు..... మీ పనులు మీరు ఎలా చేస్తారు!

జీవితంలో ప్రతీపని పైవిధంగానే చేసి ఉంటే నాకు జీవించడానికి జీవితం ఇక ఏమాత్రం ఉండేదికాదు; దేవుణ్ణి అప్పు అడిగి ఇంకో జీవితం అడగాల్సి వచ్చేది.

చచ్చినా ఇచ్చేవాడు కాదు, పైపెచ్చు"ఇచ్చిన జీవితాన్ని పూర్తిగా జీవించకుండా, జీవితం అంతా పనులమీద మనసుపెట్టి ఎవడు చేయమన్నాడు నిన్ను" అని అడ్డమైన దొబ్బులూ, చివాట్లు పెడతాడు.

"అయినా నీకు ఇచ్చిన జీవితం సరిగా జీవించివుంటే -ఒక్క పనుల గొడవల్లోనే పడకుండా-ఇంకొకసారి మళ్లీ ఇచ్చేవాడిని" అని అనకుండా ఉంటాడా.

పొరపాటున ఇవన్నీ దృష్టిలో పెట్టుకోకుండా నోరుజారాం అనుకోండి ఆయనతో దూలదీరిపోతుంది గోదావరి జిల్లావాళ్లకు మల్లే- "పాగోజి- తూగోజీ"వాళ్ళని సృష్టించింది కూడా ఆయనే కదా!

అందుకనే కాస్త ముందుచూపుతో చాలావరకు పనులు బాగానే చేశా జీవితంలో;
అవునూ నాకు తెలియక అడుగుతా-మనకు ఏమైనా "పద్మ అవార్డులు,జీవిత సాఫల్యం అవార్డులు" కావాలా;
మన జీవితం సుఖంగా పరిపూర్ణంగా బతికేయక.

అందుకనే ఎవరైనా ఈ విషయంలో ఏమైనా అన్నానేను సుతరాము ఖాతరు చేయను- ప్రతీపనీ, పక్కాగానూ, పద్ధతిగానూ చేయాలని అన్నా కూడానూ!

ప్రతీవాళ్ళకి వాళ్ళ స్వభావంవల్ల, అలవాట్లవల్లా ఆయా లక్షణాలు అబ్బుతాయి, అదీకాకుండా వాళ్లకు అన్నీపక్కాగా- అదేనండి మనసుపెట్టి చేయడం వాళ్ళ జీవిత పరమావధిగా భావిస్తారు – "అతడు" సినిమాలో తనికెళ్ళ భరణి మహేష్ బాబుని అన్నట్టు- "ఏదో మొక్కకు పాదు చేస్తున్నట్టు, ఎంత పద్ధతిగా కొట్టాడ్రా, వాడు మగాడ్రా బుజ్జీ "అని!

జీవితం పరిపూర్ణంగా బతుకుతూ-"ఇటుపక్క వాళ్ళని,అటుపక్క వాళ్ళని, ఎదురుగుండా ఉండే వాళ్ళని, వెనకఉండే వాళ్ళని" కూడా పట్టించుకోవాలని నా కోరిక- అందరూ కూడా (స్వర్గీయ దాసరి నారాయణరావు గారి సంభాషణలు ఇలానే ఉండేవి)

ఎప్పుడూ పనిమీదే మనసుపెట్టి చేస్తే మనుషులమీద, ప్రేమలమీద మనసుపెట్టే తీరికా ఉండదు, ధ్యాసా ఉండదు-ఏదో ఈసారికి ఇలా కానిచ్చేస్తే పోలా ఈ జీవితం- మరుజన్మ మానవజన్మో కాదో తెలియదు కూడా!

పనులు ఎంత బాగా చేసామా అన్నదికాదు,జీవితంలోఎంత సుఖంగా ఆనందంగా ఉంటూ అవతలవాళ్ళని కూడా ఆనందపరిచామా లేదా అన్నది ముఖ్యం-ఎందుకంటే మన ఆనందాన్నిఅందరికి పంచాలి కూడా- మన దగ్గరే అట్టేపెట్టుకోకూడదు.

ఏదో ఇలాగ బతికేస్తే భగవంతుడు మళ్ళీ మానవజన్మే ఇస్తాడని నా దిలాసా!

పొరపాటున ఇవన్నీ దృష్టిలో పెట్టుకోకుండా నోరుజారాం అనుకోండి ఆయనతో దూలదీరిపోతుంది గోదావరి జిల్లావాళ్లకు మల్లే- "పాగోజి- తూగోజీ"వాళ్ళని సృష్టించింది కూడా ఆయనే కదా!

అందుకనే కాస్త ముందుచూపుతో చాలావరకు పనులు బాగానే చేశా జీవితంలో;
అవునూ నాకు తెలియక అడుగుతా-మనకు ఏమైనా "పద్మ అవార్డులు,జీవిత సాఫల్యం అవార్డులు" కావాలా;
మన జీవితం సుఖంగా పరిపూర్ణంగా బతికేయక.

అందుకనే ఎవరైనా ఈ విషయంలో ఏమైనా అన్నానేను సుతరాము ఖాతరు చేయను- ప్రతీపనీ, పక్కాగానూ, పద్ధతిగానూ చేయాలని అన్నా కూడానూ!

ప్రతీవాళ్ళకి వాళ్ళ స్వభావంవల్ల, అలవాట్లవల్లా ఆయా లక్షణాలు అబ్బుతాయి, అదీకాకుండా వాళ్లకు అన్నీపక్కాగా- అదేనండి మనసుపెట్టి చేయడం వాళ్ళ జీవిత పరమావధిగా భావిస్తారు – "అతడు" సినిమాలో తనికెళ్ళ భరణి మహేష్ బాబుని అన్నట్టు- "ఏదో మొక్కకు పాదు చేస్తున్నట్టు, ఎంత పద్ధతిగా కొట్టాడ్రా, వాడు మగాడ్రా బుజ్జీ "అని!

జీవితం పరిపూర్ణంగా బతుకుతూ-"ఇటుపక్క వాళ్ళని,అటుపక్క వాళ్ళని, ఎదురుగుండా ఉండే వాళ్ళని, వెనకఉండే వాళ్ళని" కూడా పట్టించుకోవాలని నా కోరిక- అందరూ కూడా (స్వర్గీయ దాసరి నారాయణరావు గారి సంభాషణలు ఇలానే ఉండేవి)

ఎప్పుడూ పనిమీదే మనసుపెట్టి చేస్తే మనుషులమీద, ప్రేమలమీద మనసుపెట్టే తీరికా ఉండదు, ధ్యాసా ఉండదు-ఏదో ఈసారికి ఇలా కానిచ్చేస్తే పోలా ఈ జీవితం- మరుజన్మ మానవజన్మో కాదో తెలియదు కూడా!

పనులు ఎంత బాగా చేసామా అన్నదికాదు,జీవితంలోఎంత సుఖంగా ఆనందంగా ఉంటూ అవతలవాళ్ళని కూడా ఆనందపరిచామా లేదా అన్నది ముఖ్యం-ఎందుకంటే మన ఆనందాన్నిఅందరికి పంచాలి కూడా- మన దగ్గరే అట్టేపెట్టుకోకూడదు. ఏదో ఇలాగ బతికేస్తే భగవంతుడు మళ్ళీ మానవజన్మే ఇస్తాడని నా దిలాసా!
మీరు కూడా పనులధ్యాసలో పడి జీవించడం మర్చిపోకండి!

# మీ బరువు ఎంత!!!

ఎంత సులువైన ప్రశ్న- అందరూ టక్కున సమాధానం చెప్పేయగలరు కూడా-

కె.బీ.సి ప్రశ్న కాదుగా అని అనుకుంటున్నారా- అయితే పప్పులో కాలేసినట్టే!

మనిషి సగటున ఓ నలభై కిలోల నుంచి వందకిలోలకు ఉండొచ్చు,కొంతమంది పెచ్చుగా కూడా ఉండొచ్చు.

130 కోట్ల జనాభా బరువు-సగటుగా ఓ ముప్పయి తీసుకున్నా భూమి చాలా భారం మోస్తోంది- ఇంతవరకు భూమాతకు ఇబ్బందేమీ లేదు- సర్దుకుంటుంది-మన బరువు మనం మోయట్లా అలాగే!

కానీ మనం నిత్యం కొనే, వాడే వస్తువుల బరువులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి; ఇంట్లో వాడే గృహోపకరణాలు - స్కూటర్లు,మోటార్ సైకిళ్ళు, కార్లు,లారీలు,బస్సులు, రైళ్లు,బళ్ళు-అనేకమైన ఇలాంటివి. వాటి బరువు లెక్కలు నేను వేయబోవడం లేదు, మీకు లెక్కేసి చెప్పబోవడం లేదు కూడా- కంగారు పడకండి-అంత కంగాళీ నేను చేయలేను- నాకు చేత కాదు కూడా- లెక్కల్లో నేను బలహీనం (వీక్)!

భూమి మీద ఉండే చెట్లు,మొక్కల బరువు కంటే ఎన్నో రెట్లు-మనమూ మనం వాడే వస్తువుల బరువు ఉంటుంది-మనం ఊహించుకోవడానికి కూడా సాహసం చేయలేనంత. కొంతమంది, వాళ్ళ బరువే వాళ్ళు మోయలేనంత గా ఉన్నారు- నిత్యం ఇబ్బందిపడుతూనే ఉన్నారు, బరువు తగ్గడానికి వాళ్ళ వంతు ప్రయత్నాలు చేస్తూనేవున్నారు!

మరి మన బరువే మనం మోయలేని స్థితిలో కొంతమంది,మనం వాడే వస్తువుల బరువులు పెంచుకుంటూ చాలామంది ఉంటే- నాకు భారం ఎక్కువైపోతోంది అనుకుని భూదేవి కుంగిపోతే మన పరిస్థితి ఏమిటి!

ఇక నుంచైనా,మీరు మీ బరువు చూసుకునే సమయంలోఇది దృష్టిలో పెట్టుకుంటే కొద్దిగా ఈ బరువు తగ్గాలని, తగ్గించాలనే స్పృహ ఉంటుంది- ఆవిధంగా  కొద్దిగా ఈ ధరణి భారం తగ్గించవచ్చు.  ఈ బరువు తగ్గించడం అనేది, సన్నా-లావూ, పొట్టీ-పొడుగూ అనే సంబంధం లేకుండా అన్ని రకాల సైజులలో ఉన్న ప్రతి మానవుడు చేయాల్సిన పని! ఇప్పుడు చెప్పండి మీబరువు ఎంతో-అర్థమైందా దీనికి అంత సులువుగా సమాధానం చెప్పలేరని!

మీ బరువు చూసుకునేటప్పుడు మీరు భూదేవి మీద వేసే భారం కూడా గమనిస్తూ ఉండండి!

# అమాయకత్వం భయపడి పారిపోయింది!!!

చిన్నతనంలో మాఊళ్ళో రెండు సినిమా హాళ్లు ఉండేవి (అప్పట్లో చాలా ఊళ్ళల్లో ఉండేవనుకోండి) ఒకటి సరిగా వినపడదు, మరొకటి సరిగా కనపడదు అనుకోండి-అది వేరే సంగతి!రెండు సినిమా హాళ్లలో నాగేశ్వర రావు, ఎన్.టి.రామారావు ఎలా ఉంటారు అదే టైములో అని ఓ పెద్ద సందేహం.

పెద్దవాళ్ళు దానికి సమాధానంగా- ఒక సినిమాహాల్ నుంచి ఇంకో సినిమాహాల్ కి వాళ్ళు రావడానికి సమయం పడుతుంది కాబట్టీ,మొదటి హాల్ వాడు సినిమా వేసిన అరగంటకి రెండో హాల్ వాడు సినిమా మొదలుపెడతారు అనేవాళ్ళు.

ఆ సమాధానంతో సంతృప్తి చెందేవాళ్ళం-అప్పుడు మనసులో ఓ వెధవ కోరిక పీకుతూ ఉండేది "మరి వాళ్ళని మనం చూడొచ్చు కదా" అని అడిగేవాళ్ళం! "అడిగిన వాళ్లందరికీ అలా కనపడితే సినిమా ఆలస్యం అవుతుందిగా"అనేవాళ్ళు- అదీ సరిగ్గానే అనిపించేది! అయినా లోపల ఓ పీకులాటా, ఉబలాటం కదా వాళ్ళని చూడాలని- "సినిమా రెండో ఆట అయిన తర్వాత చూడొచ్చు కదా"- చూడాలనే కుతి వల్ల"అప్పటికే ఆలస్యం అవుతుంది కదా- వాళ్ళు వెళ్లి పడుకోవాలి కదా- అయినా అలా అందరినీ అనుమతించరు;వాళ్ళు సినిమా తారలు కదా" అనేవాళ్ళు!

ఏవిటో ఆ చిన్నతనంలో ఆ సమాధానాలకే సంతృప్తి చెందటంవల్ల ఇంకా సందేహాలు వచ్చేవికావు మా అమాయకపు బుర్రలకి- సంబరపడిపోయేవాళ్ళం! అంతే కానీ,వేరే ఊళ్ళో కూడా అదే సినిమా వస్తే వీళ్ళు అక్కడకి ఎలా వెళ్తారు అనే ఆలోచనే వచ్చేది కాదు.అదీ అమాయకత్వం అంటే- ఆ అమాయకత్వంలోని ఆనందమే వేరు- చెప్పలేనిది- వర్ణనాతీతం.

ఆ మధ్య ఈటీవీ లో "అలీతో సరదాగా" కార్యక్రమంలో ఒక యువ నటుడు కూడా ఇదే మాట ప్రస్తావించాడు-అదృష్టవంతుడు, ఇతను కూడా బాల్యాన్ని ఆనందంగా గడిపాడు.అంటే ఏదో మాతరంలో వాళ్ళేకాదు, తర్వాత తరం కూడా అన్నమాట-ఈ అమాయకత్వంతో ఆనందించింది!

అంతేగానీ, ఇప్పటిలాగా "అవతార్" సినిమా చూసి గ్రాఫిక్స్ అనడం,బాహుబలి సినిమా చూసి-ఆ... "ప్రభాస్ గొప్పేంటి- అవి గ్రాఫిక్స్"అని అనడంలో ఆనందం ఎక్కడుంది చెప్పండి! తెలివితేటలు ఉండాలి, ఎవరూ కాదనరూ,కానీ ఇప్పటి చిన్నపిల్లల్లో (పుట్టు గుడ్డుల్లో కూడా ) అమాయకత్వం అనేది దుర్బిణి వేసినా కనపడి చావదు.దానికి సాంకేతిక విప్లవం కారణం- రెండు నెల్ల గుడ్డు చేతుల్లో తల్లితండ్రులు చరవాణి చేతిలో పెట్టేయడం,ఆ గుడ్డు పిల్లేమో నొక్కేయడం మన వాళ్ళు సంబరపడిపోవడం అది చూసి-ఏమైనా అంటే పిల్లల్ని చూసే టైం లేదు అనేస్తారు.

కొద్దిగా ఎదిగిన పిల్లలు అంత మారాం చేస్తూంటే- మీరు అటూ ఇటూ దిక్కులు చూసే బదులు ఆ "అష్టదిక్కులూ" ఏంటో పిల్లలకి నేర్పండి.అలాగే మనకు దిక్కు తోచనప్పుడు ఆకాశం వైపు చూస్తాం మన సమస్య పరిష్కారం కోసం, అదే ఆకాశం, సూర్యుడు, రాత్రిపూట చంద్రుడు, వెన్నెల, నక్షత్రాలు చూపించండి.

మీరు ఇలా చేయడం వాళ్ళ మీ పిల్లకాయలకి వీటి మీద ఆసక్తి పెరుగుతుందేమో- మీరు మీ చిన్నతనంలో ఆరుబయట మంచంమీద పడుకొని ఆకాశంలో "సప్తర్షి మండలం, నక్షత్రాలు" వాటి కదలికలు చూసిన వాళ్ళేగా- ఆ తర్వాత మీ పెళ్ళిలో కనపడని అరుంధతి పట్టపగలు చూసి ఉంటారు!

మా చిన్నప్పుడు చూసేవాళ్ళం అని మాటిమాటికీ అనుకోవాల్సిన పనిలేదు-  పనిలో పనిగా మీరు మీ చిన్ననాటి జ్ఞాపకాలు మళ్ళీ తిరగతోడుకోవచ్చు- మీ పిల్లలకి అవి చూపిస్తూ. అందరూ గుండెమీద చేయి వేసుకొని చెప్పండి,మీరు చివర సారిగా రాత్రిపూట ఆకాశం వైపు, నక్షత్రాల వైపు చూసారో చెప్పండి.మనసుంటే మార్గం ఉండకపోదు.

ఏదైనా మన చేతుల్లోనే, మన జీవితమైనా, మన పిల్లల జీవితాలైనా ఎప్పుడూ, యూ ట్యూబులు, నెట్ ఫ్లిక్, అమెజాన్ ప్రైమ్ లేనా.ఎలాగూ మన శాస్త్రవేత్తలు గగ్గోలు పెట్టేస్తున్నారు- పుట్టిన ప్రతి గుడ్డుని ఇంజనీరింగ్ చేయిస్తే, మన దేశంలో శాస్త్రవేత్తలు ఎలా తయారవుతారు అని ఏమో మీ పిల్లల్లో శాస్త్రవేత్తలు ఉన్నారేమో-కొన్నేళ్లతర్వాత మన అంతరిక్షనౌకలు ఆకాశంకి పంపేవాళ్లలో మీ పిల్లలు కూడా ఉంటారేమో-ఎవరు చెప్పొచ్చారు!

(ఎప్పుడో ఆకాశవాణి చెప్పినట్టు గుర్తు- మనకంటే చైనాలో ఎక్కువ శాస్త్రవేత్తలు ఉన్నారు, తయారవుతున్నారు కూడాను అని)

ఇంకొందరుంటారు- చరవాణి, టి.వి.రిమోట్, ఎలెక్సా తో మాట్లాడటం, దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో నేర్పేస్తారు. అసలు ఇలాంటి పరికరాలన్నీ ఒక "సర్వేలెన్స్ కెమెరా" లాగా పని చేస్తాయని, మన వ్యక్తిగత విషయాలు, అభిరుచులు భద్రపరుస్తాయని తెలియదా.తెలియకేం- అంతా చదువుకున్న వాళ్ళు-అందునా సాఫ్ట్ వేర్ కంపెనీల్లో పనిచేసేవాళ్ళేగా. ఈ వయసుకే పిల్లలకి ఇవి అలవాటు చేస్తే, వాళ్ళు ఎంత బద్దకస్తులు అవుతారో,వాళ్ళ మైండ్ కంట్రోల్డ్ గా అయిపోదూ.

ఇబ్బంది ఏమిటంటే ఇవన్నీ తెలిసికూడా సౌలభ్యంగా ఉంటుందని పిల్లల బెడద రోజువారీ ఉండదని అలవాటు చేసేస్తారు.ఇక ఈ పిల్లలు తల్లితండ్రుల మాట వింటారా;ఛస్తే వినరు, ఇదేమాట ఆ తల్లితండ్రులు ఆప్తులతో చెప్పుకుంటారు- కొంతమంది బాధతో, కొంతమంది గొప్పగా! స్వయంకృతాపరాధం కదూ ఇవన్నీ!

వాళ్ళ పిల్లల అమాయకమైన బాల్యాన్ని పణంగా పెట్టడంలేదూ ఈ తల్లితండ్రులు- అందుబాటులో ఉండే ప్రతీ వస్తువుని వాడక్కర్లేదే.ఒక వేళ వాడినా దానికి కొన్ని పరిమితులుండాలి కదా "అతి సర్వత్ర వర్జయేత్" అనే గొప్ప నానుడి ఉందిగా - "అతి ఏదైనా చెడ్డదే"!

ఇంకొందరుంటారు "పాలసీసా, మందుసీసా" ముందు పెట్టేయడం; ఆ "గుడ్డు వెధవో, వెధవదో" మందు సీసాకి ఎగబడితే ఏదో ఎవరెస్ట్ ఎక్కినంతగా తల్లి తండ్రులు ముచ్చట పడిపోయి సామాజిక మాధ్యమాల్లో పెట్టేయడం.వెర్రి జనాలు లైకులు కొట్టేయడం అదేదో గొప్ప ప్రతిభ అన్నట్టు.అంతేగానీ ఆ తల్లితండ్రులకు ఏమయినా బుర్ర ఉందా తమ పిల్లల్ని చెడగొట్టేది తామే అనే ఇంగితజ్ఞానం ఉందా- లేకేగా ఈ వెర్రి పోకడలు.

అలా పెరిగిన ఆ నెలల గుడ్డు, పిల్లో- -పిల్లోడుగానో పరిణామం చెంది ఇక పెద్దయ్యేలోపే ఎలా తయారవుతుందో ఊహించుకోవడం పెద్ద కష్టమే కాదు- బుర్రలేనివాడు కూడా ఊహించుకోగలడు.ఆ గుడ్డు తల్లితండ్రులు తప్ప- "సుందర్ పిచాయో, సత్యా నాదేళ్లో" అవుతారని భ్రమ కాబోలు వీళ్ళకి-చిన్నప్పణ్ణుంచి చరవాణి చేతులో ఉంది కాబట్టి.వాళ్ళిద్దరికీ జీతం ఇచ్చేది మనం ఈ రొచ్చులోంచి బయటపడకుండా చేయడానికి-ఇంకా ఇంకా కూరుకుపోవడానికి.

తల్లితండ్రులకి ఇవి సరదాగా-గొప్పగా ఉండొచ్చుగానీ- వాళ్ళపిల్లల్ని ఆ వయసులోనే చరవాణిని ఓ చేతిలో పెట్టి ఉగ్గుపాలతోనే అక్షరాభ్యాసం, దృశ్యాభ్యాసం కూడా చేయించేస్తున్నారని తెలియట్లా-ఇలాంటి పిల్లల్ని "బాసర" కూడా తీసుకెళ్లడం ఎందుకంటా అక్షరాభ్యాసానికి!

చదువులతల్లి సరస్వతీదేవి చేతులో చరవాణి లేదే,ఇప్పటికీ వీణ మాత్రమే ఉందిగా! పోనీ ఆవిడ చేతిలో వీణ ఉందిగా వీణ పెట్టచ్చుగా మన పిల్లకాయ చేతిలో!

ఎప్పుడో ఇలాంటివాళ్ళు ఆ సరస్వతీదేవి చేతులో ఓ చరవాణి పెట్టిస్తారు పూజారితో మాట్లాడి!

"మన చేతిలో ఏముంది" అని మన పెద్దవాళ్ళు అంటూ ఉంటారు.బహుశా ఇదే అనుకుంటా -మన చేతిలో ఉన్న చరవాణి చేతులో ఉంది కానీ మన చేతిలో ఏముంది!

ఏదో నా చేతిదురద తప్ప ఈ రాతలు ఎంతవరకు జనం పాటిస్తారు.పై రాతలు చూసి ఈ చివర దాకా చదివేవాళ్ళు ఎంతమంది.ఇక్కడ దాకా చదివినందుకు మీకు నా ధన్యవాదాలు!

# తల బద్ధలు కొట్టుకున్నా కొన్నిప్రశ్నలకి సమాధానం దొరకదు!!

"అంతా తాను అనుకున్నట్టు, తన ప్రకారమే జరగాలి", "తమ మాటే వేదం" అనుకునే వ్యక్తులు మనకు జీవితంలో తారసపడతారు.అదే భావన అవతలి వ్యక్తులకు కూడాఉండొచ్చు, సహజమే కదా అని అనిపించదా,వీళ్ళకి-అని నా ధర్మసందేహం ఈ చిన్నిబుర్రకి!!!

ఇలాంటివారికి "గరికపాటి"వారో, "చాగంటి"వారో సూక్ష్మంగా మొట్టికాయ వేసిగానీ, దీర్ఘంగా నలుగుపెట్టి తలంటి పోసిగానీ- సమాధానం చెప్పగలరు గాని-ఇలా అనుకునే వారి మనస్తత్వం మారుతుందా, వాళ్ళు చెపితే మాత్రం,ఎన్ని ప్రవచనాలు వింటే మాత్రం!

మహానుభావులకి నోరు నొప్పేగాని,అయినా వాళ్ళు అలా అనుకోరు కాబట్టే మొహమాటం ఉండదు కాబట్టే నిష్కర్షగా- "గరికపాటివారు అయితే ఘాటుగా, సూటిగా", "చాగంటి వారయితే సుతిమెత్తగా,నొప్పించక-తానొవ్వక లాగా" ఏకధాటిగా చెబుతున్నారు.వాళ్ళు మనలాంటివాళ్ళని ఉద్ధరించడానికి వచ్చిన పుణ్యపురుషులాయే మరి.

వీళ్ళని పుట్టించిన బ్రహ్మతరం కూడా కాదు-తరం కాదు అంటే "చేతకాదు అని కాదు" నాభావన.ఆయన రూపకల్పన (డిజైన్) కావాలనే చేసి వదిలాడు ఈలోకం మీదికి, మన మీదికి-ఇలాంటివాళ్ళని.ఏదో బాధతో అనుకుంటాంగానీ వీళ్ళవల్ల ఓ ఉపయోగం కూడా ఉంది-వీళ్ళ ధర్మమా అని క్షమా, ఓర్పు, సహనం, ఆధ్యాత్మికతతో బాటు వైరాగ్యం ఉచితంగా-సులభంగా కూడా వచ్చేస్తుంది- (ముక్కుమూసుకోవడాలు, ధ్యానాలు, యోగాలు, తపస్సులు, ఆన్లైన్ తరగతుల అవసరం లేకుండా) భగవంతుడు కావాలని ఓ పథకం ప్రకారం వీళ్ళని సృష్టించాడని నా గట్టి నమ్మకం మానవాళి మేలుకే!

మన తడాఖా తేల్చుకుందామని,మనం వీళ్ళతో ఎలా"వేగుతామో" చూడటం ఆయనకు బహుశా సరదా కాబోలు."వేపుడంటే" ఎవరికి ఇష్టం ఉండదు, "ఆరోగ్యానికి వేపుళ్ళు మంచివి కావని" వాళ్ళావిడ తిననివ్వదనుకుంటా-అన్నీ ఉడకబెట్టిన కూరగాయలు పాపంఆయనకు!

అందుకనే అప్పుడప్పుడు మా ఇంట్లో వేపుడు చేసినప్పుడు ఆయనకు నైవేద్యం పెడుతుంటా-"అదో తుప్తి నాకు ఏ.వి.ఎస్ లాగా"-ఈవిషయం మా ఆవిడకి తెలియదు-తెలిసందంటే నాపని వేపుడే! ఈవిధంగా మన వేపుడికి ఆయన కోరిక తీర్చుకొంటున్నాడు బహుశా మరి (వీళ్ళ వేయింపుకి ఆయన జిహ్వా రుచి తీరిపోతుంది అనుకుంటా)

దేవునితో హాస్యం,ఈ పరాచకాలు ఏమిటీ అనుకుంటున్నారా-దేవుడుతో మనం ఏం మాట్లాడినా ఏం అనుకోడు.అందునా కొద్దిగా నాకు ఆయనతో ఉన్నసాన్నిహిత్యానికి అతిచనువు తీసుకోవడం అలవాటయ్యింది-ఆయనా పెద్దగా అభ్యంతర పెట్టిందిలేదు నాతో!

ఈ రోజుల్లో అందరితో హాస్యమాడలేముగా-అందుకే ఆయనతో...

ఇంట్లో వాళ్ళతోనే హాస్యంగా ఉండే రోజులు కాదు- మీతో ఎక్కువహాస్యం చేస్తే మీకు కూడా నామీద కోపం రావచ్చు,నారాతలు మీరు చదవడం కూడా మానేయొచ్చు కోపంతో- అందుకే సాహసం చేయలేను! కాకపోతే ఓ చిన్ని ఆశ ఏమిటంటే ఆ భగవంతుడే వీళ్ళకి కొద్దిగా ఈ విషయాన్ని బోధపరిచి జ్ఞానోదయం కలిగిస్తే బాగుండును అని-ఎప్పటికైనా; ఏంచేస్తాం అప్పటివరకూ ఇలాంటి వాళ్ళని భరిస్తూ బతుకుబండి లాగించేద్దాం!

మీరేమంటారు-నాచాదస్తం కానీ మీరు మాత్రం నామాట కాదంటారా ఏమిటి!!!

ఇలాంటివాళ్ల వల్ల బాధపడకుండా ఉన్నవాళ్ళు ధన్యజీవులు,ఎంచేతంటే-భగవంతుడి కృపలేకుండా ఇలా ఎలా బతికేయగలరు. “శివుని ఆజ్ఞ లేకుండా చీమయినా కుట్టదు”, మరి ఇలాంటివాళ్ళ, కుట్టుడు- కుట్టుడు లేవంటే చిదంబరరహస్యం ఏమిటి- భయపడకండి ఇప్పుడు మిమ్మల్ని చిదంబరం తీసుకెళ్లను- ఇక ఉంటానండి ఈ రోజుకి!!!

స్వస్తి!

# “అవసరం, ఉపయోగం, వాడుకోవడం”!

“ఎందుకూ, ఏమిటి, ఎలా” అని బాబూమోహన్ లాగా!

మన నిత్యజీవితంలో ఈ మూడు పదాలకు ఉన్నంత ఉపయోగం మనకు తెలియంది కాదు;వీటిని వినియోగించినంతగా వేరే తెలుగు పదాలను మనం  పెద్దగా ఉపయోగించం అనుకుంటా. కొంతమంది మనుషులు వాళ్ళ జీవితాల్లో ఈ పదాల ఆంతర్యాన్ని, భావాన్ని గ్రహించి జీవితంలో ఎదుగుతారు (వేరేవాళ్ళ భుజాల మీద ఎక్కుతూ పైకి వెళ్లేవాళ్ళు వేరేనండి-వీళ్ళని వాళ్ళుగా అపార్ధం చేసుకోవద్దు)

గమ్మత్తు ఏమిటంటే ఇలా చేసే ప్రక్రియలో ఒక్క పదాన్ని కూడా వీళ్ళు వాడనవసరంలేదు- అర్ధాన్ని, తత్వాన్ని ఆచరణలో పెట్టడమే.ఇవి తెలుగు భాషలో సమస్త మానవాళి ప్రయోజనార్ధం సృష్టించిన ప్రత్యేకమైన పదాలు అనుకుంటా;
(మరీ ముఖ్యంగా “అవసరాలరావులకు”)పదాలని ఉచ్ఛరించకుండా వాటి అర్ధాల్ని గమనించి, భావాలు అవతలవాళ్ళదగ్గర బయట పడకుండా అమలుచేయొచ్చు.

అవతలివాళ్ళు తమకు "ఉపయోగపడటం" కోసమే ఉన్నారని, తమకు "అవసరం  అయినప్పుడల్లా ఉచితంగా "వాడుకోవచ్చని" అందుకే దేవుడు వీళ్ళకోసం సృష్టించాడనే భావనలో ఉంటారు- వాడేసుకుంటారు-ఫుల్లుగా!  బ్రహ్మానందం మహేష్ బాబు సినిమాలో అంటాడుగా -"నా టాలెంట్ పూర్తిగా వాడుకోండి సర్" అని- అలాగన్నమాట- నా ఉద్దేశం వాడబడేవాళ్లంతా బ్రహ్మానందాలు అని, వాడుకునేవాళ్ళు మహేష్ బాబులని కాదు.

మనుషుల్ని రెండు వర్గాలుగా విభజించవచ్చు ప్రస్తుత పరిస్థితుల్లో...  వాడుకునేవాళ్ళు: ఎదురుగా ఉన్నది వస్తువయినా, మనిషి అయినా మనం  వాడుకోవడానికేగా  దేవుడు సృష్టించింది అనుకునేవాళ్లు!

వాడబడేవాళ్లు: అది మంచితనమో, అమాయకత్వమో, సహజ స్వభావమో, పోనీలెద్దూ అనుకునే స్వభావమో- ఏదైతేనేం, ఎవరి కారణాలు వాళ్లకి ఉంటాయి- ఏతావాతా వీళ్ళందరూ ఇతరులు తమల్ని వాడటమే కోసమే సృష్టించబడ్డామని భ్రమలో బతికేస్తుంటారు.

కానైతే ఇందులో కొంతమంది- కొంతకాలానికి జ్ఞానోదయమై ఈ వాడబడటం అనేదీ క్రమేపి తగ్గించుకుంటూ వెళ్తారు-“మనమేమైనా వెర్రివెధవల్లాగా కనపడుతున్నామా వాడుకునే వాళ్ళకి” అనే ఓ సందేహం వచ్చినాక- గుడ్డిలో మెల్లలాగా- ఈ వర్గం వాళ్ళు కొద్దిగా మెరుగు-నిజం ఎరిగారు కాబట్టి!

ఇంకొంతమంది ఉంటారు-లోపల ఈఅభిప్రాయం పీకుతున్నా-ఆ సమయానికి వాళ్ళ స్వభావం వల్ల-అవతలవాళ్ళు “డోర్ మాట్” లా వాడుతున్నా మౌనంగా ఉంటారు!  వీళ్ళని భగవంతుడు మాత్రం ఏం చేస్తాడు చెప్పండి!

ఓ వేళ భగవంతుడు చెప్పడానికి ప్రయత్నం చేసినా- వీళ్ళు ఎదురు ప్రశ్న వేస్తారు- "నువ్వే కదయ్యా చెప్పావు ఇతరులకి ఉపయోగపడమని- మరి ఇప్పుడేమో మరోలాగా చెబుతావు ఏంటి" అని- ఎందుకొచ్చిన గోల నాకు అని దేవుడు కూడా గమ్మునుంటాడు- వీళ్ళతో- ఈ విషయంలో- "ఓహో వీళ్ళకి లౌక్యం అనే పదార్థం పెట్టడం నేనే మరిచినటున్నా" అని నాలిక కూడా కొరుక్కుంటాడు!

అలా అని ఈ వాడుకునేవాళ్ళు చెడ్డవాళ్లనే ముద్ర నేను వేయబోవడం లేదు; ఎంచేతంటే ఇతరులని తమ అవసరం వచ్చినప్పుడల్లా వాడుకోవడం అనేది సామాన్యమైన విషయం కాదు, ఆషామాషీ కాదు-దానికి సామర్థ్యం, తెలివితేటలూ ఉండి తీరాలి.ఎందుకంటే ఈ విద్య "అరవైనాలుగు కళల్లో" లేదు మరి.

పూర్వంవాళ్ళు "దార్శనికులు" కాదు అనుకుంటా ఈ విషయంలో-రాబోయే కాలంలో కొంతమంది ఇలా తయారు అవుతారని- ఈ మేధావి వర్గం రోజురోజుకి- కోవిడ్ వైరస్ లా వ్యాప్తి చెందుతారని వాళ్ళు కలలో కూడా ఊహించి ఉండరు-అందుకనే ఈ కళని 64 కళల్లో చేర్చలేదు అప్పట్లో.

వీళ్లచేత వాడబడేవాళ్ళలో కొంతమందికి జ్ఞానోదయం అయినా వీళ్ళకొచ్చిన ఇబ్బంది ఏమీ లేదు-వీళ్లకున్న ప్రతిభవల్ల వాడుకోవడానికి కొత్తవాళ్ళని ఇట్టే పట్టేస్తారు (అమాయకపు గొర్రెలు ఇంకా ఉంటారుగా ఈ లోకంలో) అంతేగాని వీళ్ళ అలవాట్లను  మాత్రం- అదే ఈ వాడుకోవడం అనే విద్యని- వదలలేరు- సప్త వ్యసనాల్లో చేర్చలేదు గాని ఇదీ ఒక వ్యసనం అనుకుంటా.

కళలు అంటే ఇంకో విషయం గుర్తుకొచ్చింది; చాలామందికి (నాకు కూడా) 64 కళలు తెలియవు, ఓ వేళ తెలిసినా కంఠతా రావు-ఇప్పుడు నేను రాయట్లేదు లెండి- కానీ ఒక విషయం తెలుసు- చాలా మందికి తెలియని విషయం.ఈ 64 కళలు అంటే అవి అబ్బినవాళ్ళు కళాకారులు అని ఏదో గొప్పవాళ్ళని అనుకుంటాం సాధారణంగా. కానీ ఇందులో కొన్ని కళలే పేరు గుర్తింపు,కీర్తి, డబ్బు తెచ్చిపెడతాయి, కొన్ని కళలయితే- పొట్ట నింపుకోవటానికి, జనాన్ని మోసం చేయటానికి, వినోదం పంచటానికి,ఇతరులని ఆకర్షించడానికి  ఉపయోగపడతాయి.కాస్త అర్థం చేసుకోవడానికి మచ్చుకి ఆ 64 కళల్లో కొన్నింటిని ఇక్కడ ఉటంకిస్తాను.

(సర్వ వంచనం,పరకాయ ప్రవేశం,ఇంద్రజాలం, అంజనం,చోర కర్మం, శకునం, సాముద్రికం, కామ శాస్త్రం,విద్వేషణం, అలంకారం, నాటకం, కావ్యం, నృత్యం, అవధానం) మీరు వాడబడేవాళ్ళో,వాడుకునేవాళ్ళో మీకే తెలుసు - మీరు ఇలాంటి కళాకారుల వల్ల బాధితులైతే, మీ చుట్టుపక్కల ఇలా వాడుకునే వాళ్ళనుంచి కాస్త జాగ్రత్తపడితే బాగుంటుందని నా ఉద్దేశం.

నే చెప్పతల్చుకున్నది చెప్పా- ఆపై మీ ఇష్టం

"వన్ ఐడియా కెన్ చేంజ్ యువర్ లైఫ్"-"వాట్ యాన్ ఐడియా సర్ జీ"! 😃🤔
టక్కున గుర్తుకొచ్చే ప్రాచుర్యం పొందిన వ్యాపారప్రకటనల్లో ఇదీ ఒకటి!

అలాగే "వన్ గాడ్జెట్ హ్యాజ్ చేంజెడ్ అవర్ లైఫ్"......
ఒక్క చరవాణి మన చేతుల్లోకి వచ్చి మన జీవితాలనే మార్చేసింది,అన్నీ
చరవాణిలో చేసేస్తున్నాం- చూసేస్తున్నాం- మూణ్ణెల్ల గుడ్డునుంచి ముదుసలుల వరకూ!

ఇది "భార్యా భర్తల బంధం కన్నా"- "మొనగాడు లాంటి మాహా సిమెంట్"కన్నా ధృడమైనది-ఎంత గట్టిదంటే భార్యా భర్తల్లో ఒకళ్ళ చరవాణి మరొకళ్ళు చూడలేనంత, చూడకూడనంత- భార్యా భర్తల్ని కలిపిన బ్రహ్మ ఊహకే అందనంత!

అన్నీ తనలో నిక్షిప్తం చేసుకొని, విషయాలని,చిత్రాలని, విచిత్రాలని, చిత్రాతిచిత్రాలని,దృశ్య మాలికలను తనలో బందీలుగా చేసుకుంది! అవి చూడాలనే తాపత్రయంలో మనం చరవాణి కి బందీలుగా అయ్యామనే స్పృహే లేకుండా బతికేస్తున్నాం...

అసలు మనకు వేరే బతుకు అనేది ఉన్నది అనే సంగతే మర్చిపోయి చరవాణే మన బతుకుగా బతికేస్తున్నాం!

నిజజీవితంలో బతకడం మర్చిపోయాం.........😔
అసలు అది ఒకటి ఉందనే సంగతే గుర్తుంటేగా!
మన బతుకు తెరిపిన పడేస్తుందనుకున్న ఈ చరవాణి మన బతుకులు తెల్లారిపోయాలా చేస్తోంది! వర్తమానాన్ని జ్ఞాపకాలుగా చేసుకోలేకపోతున్నాం- అంచేత భవిష్యతులో నెమరు వేసుకోవడానికి జ్ఞాపకాలు లేకుండా చేసుకుంటున్నాం...
ఉన్నకాసిని జ్ఞాపకాలను అనుభవించలేక పోతున్నాం- చరవాణిలో చదివేస్తున్నాం!

ఆ జ్ఞాపకాలకు కారణమైన వాళ్ళని కలుస్తున్నామా,కనీసం మాట్లాడుతున్నామా!!!!!

అవి నెమరు వేసుకోవడమే లేదు-అవి నెమరువేసుకోవడానికి, పంచుకోవడానికి ఎవరున్నారు కనుక......
అందరికీ దూరంగా అందనంతగా జరిగిపోయాంగా గర్వంతో- ఏకాకులమయ్యామని కూడా గ్రహించకుండా!
మనం పలకరింపులు మానేసాం......
అవతలివాళ్ళు పలకరించే ప్రయత్నం చేస్తుంటే ఆ పిలుపులకు పలకడం మానేసాం!

ఎవరైనా ఆపేక్షగా ఆప్యాయంగా పలకరించాలన్నా,మాట్లాడాలన్నా,కలవాలన్నా మన అనుమతి లేనిదే కుదరదు వాళ్లకి....
మన ఇళ్లముందు "అనుమతి లేనిదే ఇతరులకు ప్రవేశంలేదు"అనే బోర్డు పెట్టేసాంగా!

రైలు ప్రయాణంలోనూ, బస్సు ప్రయాణంలోనూ మీసాటి ప్రయాణికుడితో సరదాగా కబుర్లు చెప్పి ఎన్నేళ్ళయిందో మీకు గుర్తుందా!

మనచుట్టూ ఉన్న దుకాణాలు, కూరలమ్మే వాళ్ళ దగ్గరకు వెళ్లి వాళ్ళ పలకరింపులు చూసి ఎన్నేళ్లయింది!

పది అడుగుల దూరంలో ఉన్న దుకాణానికి రెండు కాళ్లతో నడిచి వెళ్లి కావాల్సినవి తెచ్చుకొని ఎన్నేళ్లయింది!

పుట్టినరోజు శుభాకాంక్షలు ఫోన్ లో మాట్లాడుతూ అవతల వాళ్లకి చెప్పడం
ఎన్నేళ్ల మునుపు మునుపో గుర్తుందా- అసలు అలా చేయొచ్చనే స్పృహ మనకి ఇంకా మిగిలి ఉందా!

సూర్యుణ్ణి,చంద్రుణ్ణి చివరి సారిగా ఎప్పుడు చూసామోగుర్తుందా....🤔
ఆరు బయట నిలబడి ఆకాశంలో నక్షత్రాల్ని చూసి ఎన్నాళ్ళయింది-అసలు అవి ఉంటాయని గుర్తుందా- పెళ్ళిలో "కనపడని అరుంధతీ నక్షత్రమే మనం చూసింది"

"వావ్ బాగుంది" అని మనుషుల్ని కానీ, వస్తువుల్ని కానీ, అందాల్ని గానీ, ప్రకృతిని గానీ "ప్రత్యక్షంగా" మెచ్చుకున్న సందర్భాలు ఎప్పుడు చేసాం-చరవాణిలో కాకుండా!

అవతల వాళ్లకి ఆశ్చర్యం కలిగేట్టుగా వాళ్ళని ఎప్పుడు కలిసారో గుర్తుందా.....
ఇప్పుడు చెప్పి వెళ్లకపోతే మనం ఆశ్చర్య పడాలి వాళ్ళఇంటి తాళం కప్పని చూసి-అది వేరే సంగతి!

మర మనుషులతో, "అలెక్సా" "సిరి" లతో మాట్లాడుతూ ఎక్కువ సమయం గడపడం తప్ప..........
"మన మనుషులతో మనసువిప్పి" మాట్లాడి ఎన్ని సంవత్సరాలయిందో మీకు గుర్తుందా!

చరవాణి మన చేతుల్లో ఉంది కదా ప్రపంచమంతా మన అరచేతుల్లో (రిలయన్స్ వాళ్ళు అనేవారు అప్పట్లో-"దునియా ముట్టీమే" అని) ఉందని సంబరపడిపోతున్నాం కానీ.......
మన జీవితం మొత్తం చరవాణి చేతుల్లో పెట్టామన్న సంగతే మనకు తెలియట్లా!
మన వేలితో మన కళ్ళని పొడుచుకోవడం- మన చేతుల్తో మన జీవితాన్ని పాడుచేసుకోవడం అంటే ఇదేనేమో!

అప్పట్లో చేయి చూసి, చేతిలో రేఖలు చూసి జాతకం చేప్పేవాళ్లు -ఇప్పుడు రేఖల స్థానం చరవాణి కప్పేసి-మన తలరాతని, చేతుల రేఖల్ని మార్చేసింది!!😉

పట్టుమని పదిమంది ఫోన్ నంబర్లు గుర్తు ఉండవు- ఎక్కాలు పైనించి కిందకు- కింది నించి పైకి అప్పచెప్పిన బుర్రని అటక ఎక్కించేసాం!!! నోటితో కూడికలు,తీసివేతలు క్షణాల్లో చేసినవాళ్ళం- ఒకటికి ఒకటి కలపాలంటే చరవాణిలో ప్లస్సులు మైనస్సులు నొక్కాల్సిందే......
బుర్ర మర్చిపోయింది-మనం వాడటం లేదని!!!

బుర్రలో "అనంతమైన మెమరీకి" చోటు ఉందని మర్చిపోయి------
చరవాణిలో మెమరీ పరిమాణం పెంచుకుంటున్నాం!

ఒక్క రోజు చరవాణి కరములలో లేకపోతే "ఐ.సి.యూ"లోని పేషంట్ లా విలవిల లాడిపోతున్నాం-----------.
ఆక్సిజన్ అందని వాళ్ళలా!

చరవాణి వల్ల లాభాలు నేను చెప్పక్కర్లేదు---..
మనం మర్చిపోయిన వాటిలో కొన్ని అయినా ఏకరువు పెట్టడమే నా సదుద్దేశం!!

అలా అని చరవాణి వాడద్దని కాదు నా అభిప్రాయం "అతి సర్వత్ర వర్జయేత్" అని విన్నాం కదా-అది రోజూ గుర్తు చేసుకుంటూ ఉంటే- మీ చరవాణి "వాణి' కొన్నాళ్ళు పట్టించుకోకుండా ఉంటారు; మీకు మీ నిజజీవితం కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

మీలో ఉన్న సృజనాత్మకతని చంపకండి---.😒
మీలో ఉన్న జన్యుపరిణామ క్రమం కూడా మారి మీ పిల్లలకు కూడా అంటుకుంటుంది,తరతరాలకు పాకి పోతుంది-అంటువ్యాధి లాగా!!!😏

# ఎవరో చెప్పారని, ఏదో చదివాము అని మారిపోతామా...

ఒక మధ్య తరగతి ఇంట్లో చిన్న సన్నివేశం...

“దుర్గ” రామాయణం చదివిన తర్వాత భక్తి టి.వి.లో “చాగంటి”వారి ప్రవచనాలు వినడం అయిపొయింది-టి.వి.కట్టేసి తన మామూలు లోకంలోకి, సహజధోరణిలోకి వచ్చేసింది; అది చూసిన అమాయకపు భర్త సుబ్బారావు మెల్లిగా ఇలా అడిగాడు.

"ఏమేవ్ ఇప్పుడేగా మన ప్రవర్తన ఎలా ఉండాలి, ఎదుటవాళ్ళతో ఎలా మెలగాలి అని చాగంటి వారు చెప్పారు.అదీ కాక నువ్వు చదివిన రామాయణంలో కూడా అదే ఉంది కదా, మరి చీటికీ మాటికీ నామీదికి గయ్యిగయ్యిమని అంత ఎత్తున ఎందుకు లేస్తావు-అయినదానికీ కానిదానికీ" అన్నాడు.

దానికి దుర్గ విసురుగా “పుస్తకం చదవగానేనో, ఎవరో చెపితే వినగానేనో- తక్షణం మారిపోవడం మొదలుపెడితే, రోజూ నేను రకరకాలుగా మారిపోవాలి- అలా మారే వ్యక్తిని కాదు, చపలచిత్తురాలినీ కాదు” అంది!

“మరి అవన్నీ చూడటం, చదవడం దేనికిట”- స్వగతం అయినా కొద్దిగా పైకే అన్నాడు,వినీ వినపడకుండా-దుర్గ ఆ నసుగుడు వినవే వినేసింది.

“రామాయణం రామాయణమే,దుర్గ దుర్గే, అవేవో ఉన్నాయి కాబట్టి చదువుతాం అంత వరకే- “చాగంటి వారు” ఒకటి చెపుతారు,“గరికపాటి వారు”ఇంకోటి చెపుతారు, “సామవేదం వారు” వేరొకటి చెపుతారు, “మైలవరపు ఆయన” ఇంకేదో చెపుతారు, ఎందరి మాట వింటాం! ఒకళ్ళు చెప్పింది విని మారిపోతే వేరేవాళ్లని అవమాన పరిచినట్టు కాదూ!

అలాగే తెలుగు టి.వి.ధారావాహికల్లో చూస్తూనే ఉన్నాగా- మొగుణ్ణి ఎన్ని రకాలుగా చిత్రహింసలు పెట్టొచ్చో,ఎలా చంపేయొచ్చో- అవన్నీ చూసి జనం చేయడం మొదలుపెడితే లోకంలో మనుషులు మిగులుతారా.

అంతెందుకు,మొన్న ఓ పుస్తకం చదివా “భర్తని చిత్రహింసలు పెట్టి చంపడం ఎలా” అని,అది చదివా కదా అని మీ జోలికి వచ్చానా. ఈ హఠాత్పరిణామానికి సుబ్బారావు దిక్కుతోచక బిక్కచచ్చిపోయాడు (మనసులో అనుకున్నాడు “ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టుంది” అని)

“చీటికీ మాటికీ మార్చుకునే మనస్తత్వం కాదు- కచ్చితమైన నికార్సైన మనిషిని- అలా నిలకడలేని మనస్తత్వం మీది, ఎవడు చెప్తే అది వింటారు,మీరు మారండి కావాలంటే- చపలత్వం ఎక్కువ కదా మీకు” అంది.

(సుబ్బారావు మనసులో అనుకుంటున్నాడు-నేను మారకపోతే ఎప్పుడో సన్యాసుల్లో అయినా కలిసేవాణ్ని-లేదంటే ఈపాటికి కైలాసం చేరుకునేవాణ్ణి అని)

“ఇక నుంచి ఇలా పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేయకండి,మీలా ఇట్టే మారి పోయేదాన్నయితే మీరు రేపణ్ణుంచి ఇంట్లో ఉండరు,అది గుర్తు పెట్టుకోండి” అంది
అపర దుర్గాదేవి లాగా ఊగిపోతూ-అందులో దసరా సమయం కూడానూ!

“అవునూ మీ బుగ్గన ఏం పెట్టుకున్నారు- మీ నోట్లో ఏంటది, మాట తేడాగా వస్తోంది- ఏ స్వీట్ ముక్కోనోట్లో నానేస్తున్నారా- ఉన్న ఆ కాసిని పళ్ళు ఊడిచస్తాయి”అంది- సంభాషణ దారి మళ్లింది! ఇది ఎక్కడకి చేరుతుందో అనుకుంటూ -సుబ్బారావు ఇంకో సారి బిక్క మొహం పెడుతూ...

"కాదే బాబు, అరటిపండు తింటున్నా-నీతో మాట్లాడుతున్నా కాబట్టి బుగ్గన చేరేసాను, నేనేం బుగ్గన నాన పెట్టట్లా"(ఏమైనా జర్దా కిళ్లీ తింటున్నానా గుట్కానా అని అనుకున్నాడు మనసులోనే-పైకి అనే సాహసం చెయ్య లేక-నానబెట్టడం అనగానే వంటిట్లో నానపెట్టిన మినపగుళ్ళు గుర్తుకొచ్చాయి)

"మీరు తినేటప్పుడు వీధిలోకి వెళ్ళి వచ్చేపోయేవాళ్లకి మీ బుగ్గలు చూపించండి- మిమ్మల్నేదో దాష్టీకం చేస్తూ తిండి పెట్టట్లేదని వీధిలో కొంతమంది అనుమానపు పీనుగలు వాగుతున్నారు" అంది దుర్గ

కొద్దిగా ఆగి మళ్ళీ అందుకుంది" అయినా మీరేం తక్కువవాళ్ళు కాదు-మీరే వీధిలో వాళ్లకి ఏదో చెప్పుంటారు-లేతే వాళ్ళందరూ అలా ఎందుకు మాట్లాడతారు"అంది ఈ మాటలతో సుబ్బారావుకి ప్రాణంపోయినంత పనిఅయి"నేను చెప్పడం ఏమిటే- ఇంట్లో నోరెత్తనివాణ్ణి వీధిలో మాత్రం నోరెత్తే ధైర్యమా"అన్నాడు

ఇక అక్కడ ఉంటే తన మీద ఏం అఘాయిత్యం జరుగుతుందో అని ఎంచక్కా ఆ మాట అనేసి చల్లగా సుబ్బారావు అక్కడనుంచి జారుకున్నాడు నిశ్శబ్దంగా- రేపటి నుంచి రోడ్డు మీద బతకటం ఇష్టం లేక!

ఇలాంటి జంటలు ఉంటారా అని బుగ్గలు నొక్కుకోకండి- సవాలక్షమంది- బయటకు తెలిస్తాయేమిటి- ఏ మగాడు చెప్పుకు చస్తాడు- ఇంట్లో గుండమ్మ కథ నడుస్తుందని!

ఏదో సరదాకి రాసాగానీ స్త్రీ జాతిమీద వేరే భావంతో కాదండీ!

ఇవన్నీ ఎలాగున్నా బయటకెళ్ళేటప్పుడు మూతికి, ముక్కుకి మాస్క్, "జనం మధ్య ఎడం పాటించండి".ఈ మాట వింటూ ఉంటే- ఇరవై ముప్పయి ఏళ్ల క్రితం- కుటుంబనియంత్రణ శాఖవారు- ఇచ్చిన ఒక ప్రకటన గుర్తు కొస్తోంది- "ఇద్దరి మధ్య దూరం పాటించండి" అని దంపతులకి సందేశంగా ఇచ్చేవారు.

# తెలుగు వ్యాకరణం- మన పాండిత్యగరిమ

ప్రేమ అనే పదం వినడం వేరు, ప్రేమ గురించి తెలియడం వేరు, ప్రేమ ఉండటం వేరు-వ్యక్తం చేయడం వేరు-అలాగే తెలుగు భాష తెలియడం వేరు తెలుగు వ్యాకరణం ఉండటం,నేర్చుకోవడం వేరు.తెలుగుభాష తెలిసిన అందరికీ వ్యాకరణం తెలియాలి అని లేదు ఈ రోజుల్లో-గొంతు ఉన్న ప్రతీవాడికి పాడటం రావాలని అనడం ఎంత తప్పో ఇదీ అంతే!

తెలుగు వ్యాకరణంలోని కొన్నింటి వైపు తొంగి చూద్దాం!!!! ఏదో మీ అందరికీ వ్యాకరణం చెప్పే ఉద్దేశంలో మాత్రం లేను-ధైర్యంగా ముందుకు సాగుతూ చదవండి ఆసాంతం!

తెలుగు వ్యాకరణంలో “సంధులు, సమాసాలు,అలంకారాలు”, ఎలా ఉన్నా…. సందులు-సమోసాలు-అలంకారాలు చేసుకోవడం తెలియనివాళ్ళు ఒక్కళ్ళుకూడా ఉండరు అంటే అతిశయోక్తి అలంకారం అయితే కాదు!

అలాగే “కర్త కర్మ క్రియ”…

కొంతమందికి తామే “కర్త” అని తెలియకపోయినా రోజులో ఒకసారి అన్నా “కర్మ” అనే పదం వాడకుండా ఉండేవారు ఉన్నారా- అది కూడా వొత్తు పెట్టి మరీ పలుకుతారు “ఖర్మ” అని; అది “ఖర్మ” కాదు “కర్మ” అని తెలిసో మరి తెలియకో!

నానార్థాలు….

ఇవి మాత్రం బాగా వంట పట్టాయి మిగతావి ఎలా ఉన్నా-దీనికి తోడు కొంతమందైతే విపరీతార్థాలు,పెడర్థాలు,శాపనార్థాలు నేర్చేసి ప్రావీణ్యం కూడా సంపాదించారు పండితులలాగా!

పర్యాయ పదాలు….

ఇందులో చాలామంది బలహీనమే- నా భావం ఆంగ్లంలో వీక్ అని (weak) నామనసులో  అనుమానం అయితే “పర్యాయపదం” అనే దానికి అర్థం కూడా తెలిసివుండకపోవచ్చు చాలామందికి!

కళలు…

వీటికి మాత్రం లోటు లేదు-కళలు 66 అయితే ఇప్పటి జనానికి 99 కళలు వచ్చు; ప్రతీవాళ్ళు కళాకారులే-మరి కొంతమందయితే “సకలకళావల్లభులే”!

విభక్తులు….

ఇది బొత్తిగా గుర్తే లేదు, ఏంచేతంటే అందరూ భక్తులే మరి!

ఇక “గురువులు- లఘువులు”మాటకొస్తే...

“గురువు” అనే పదం చిన్నప్పుడు విని ఉంటారు-అప్పుడప్పుడు సినిమాల్లో కూడా చూపిస్తారుగా- “గురువు ఉన్నది పిల్లల చేత ఆటపట్టించుకోవడానికే అన్నట్టు”-

అంచేత ఆ గురువుని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు కొందరు- ఇక్కడ గురువుని గుర్తు చేసుకోవడం అనేది సంతోషించాం తగ్గ విషయం కాక పోయినా- కనీసం గురువు అంటే ఎవరో తెలిసినందుకు సంతోషించాలి- కానీ చాలామందికి ఈ గురువుగారి మీదా ఈషన్మాత్రం గౌరవం ఉండదు!

ప్రకృతి-వికృతి...
వ్యాకరణ అర్థాలు తెలియకపోయినా నిత్యజీవితంలో ఈ రెండు పదాలు చాలా మందికి తెలిసినవే- “ప్రకృతిని” పాడు చేయడం, “వికృతం”గా మాట్లాడటం, వికృత చేష్టలు పోకడలు పోవడం- వీటిలో బాగా ఆరితేరిపోయారు కొందరైతే!

ప్ర స్నా ర్థకం...
అవతల వాళ్ళ ప్రశ్నలకి సమాధానం దాటవేస్తూ ప్రశ్న వేసిన వాళ్ళ మొహంపై ప్రస్నార్థకంగా మొహం పెట్టడం బాగా నేర్చామ్ వీటి అర్థం బొత్తిగా తెలియవు పెక్కుమందికి!

ఆశ్చర్యార్థకాలు....
దీనికైతే లోటు లేదు, రోజూ చేసే నటనలో ఇవి అవతలవాళ్ళ మీద వాడటంలో నిష్ణాతులం

అరసున్న
ప్రస్తుతం వాడుకలో లేదు-అయినా ఇది అసలు బొత్తిగా తెలియదు-నిండుసున్నా, గుండుసున్నా తప్ప సంయుక్తాక్షరములు అసలు తెలుగు అక్షరాలే పూర్తిగా రావు చాలామందికి- ఇక సంయుక్తాక్షరములు అంటే ఏం తెలుస్తాయి,ఛస్తే తెలియవు!

లింగములు
పుల్లింగము-స్త్రీలింగము-నపుంసకలింగములు
ఈ లింగ బేధాలు అందరికీ క్షుణ్ణంగా తెలుసు-కొందరు పుట్టుకతో మగాళ్లు అయినా జీవితంలో ఏదైనా సాధించే విషయంలో నపుంసకులుగా ప్రవర్తిస్తారు

వచనములు
ఏక వచనము-బహు వచనము

వీటి అర్థం తెలియదు గానీ- పెద్దవాళ్ళని కూడా ఏకవచనంతో సంబోధన చేసే సంస్కృతికి అలవాటు పడ్డాం.బహువచన ప్రయోగం తెలియక పోయినా పెద్దవాళ్ళని గౌరవ పూర్వకంగా బహువచనంతో సంబోదించాలనే కనీస మర్యాద మర్చిపోయాం-చాలావరకు!

వ్యతిరేకార్థములు

వ్యాకరణంలో దీని నిర్వచనం తెలియకపోయినా-అవతలవాళ్ళు మాట్లాడే
ప్రతీమాటకు వ్యతిరేకార్థం తీయడంలో బహు నేర్పరులం!

తెలుగు వ్యాకరణంలో ఇంకా చాలా ఉన్నాయి- కానీ ఇప్పటికే చాలామందికి ఆసక్తి పోయి ఉంటుంది ఇది చదివే, ఇంతటితో ఆపేస్తా!

నాకో పెద్ద అనుమానం -అసలు నేను పైన రాసినవి తెలుగు వ్యాకరణంలో ఉన్నాయని ఇంకా ఎంతమందికి గుర్తుందో!

ఏదో ఈ సందర్భంగా ఈ నాలుగు గుర్తుకొచ్చాయి అదే సంతోషం

కాస్త తెలుగు వ్యాకరణం గురించి తెలుసుకోవాలంటే- “సుందర్ పిచాయ్”ని అడగండి- తడుముకోకుండా చెప్పేస్తాడు- అతనొక్కడే లోకంలో సకల విద్యా, సకల భాషా కోవిదుడు మరి!

# అయినా పర్వాలేదు!!!

ప్యాంటుకి బెల్ట్ లేకపోయినా పర్వాలేదు!
జేబులో పర్సు లేకపోయినా పర్వాలేదు!
గడ్డం పెరిగినా పర్వాలేదు!
తలకట్టు (హెయిర్ స్టైల్) ఎలా ఉన్నా పర్వాలేదు!
చేతిలో చేయి వేసి పలకరించకపోయినా పర్వాలేదు!
కరచాలనం చేయకపోయినా పర్వాలేదు!
ఆత్మీయుల్ని, ఆప్తుల్ని, స్నేహితుల్నిఆలింగనం చేసుకోకపోయినా పర్వాలేదు!
భళా (సెహబాష్) అని భుజం మీద కొట్టకపోయినా పర్వాలేదు!

లిప్ స్టిక్ వేసుకోకపోయినా పర్వాలేదు!
మేక్ అప్ లేకపోయినా పర్వాలేదు
మాచింగ్ డ్రెస్ వేసుకోకపోయినా పర్వాలేదు!
జుట్టుకి రంగు గాని,మెహేంది గాని వేయకపోయినా పర్వాలేదు!
జడా, బొట్టూ లేకపోయినా పర్వాలేదు (ఇవి ఎవరు చేస్తున్నారు ఈ రోజుల్లో-నా పిచ్చి గానీ)

"ఎవరైనా ఏదైనా, ఏమయినా అనుకుంటారేమో" అనే స్థాయి నుండి- "అయినా పర్వాలేదుకి" వచ్చాం! దాని పర్యవసానమే... ఆడా మగా అనే తేడా లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అందరికి ఓ కొత్త ఆభరణం వచ్చింది!!!! మన ఇష్టాయిష్టాలతో సంబంధం లేదు!

దాన్ని ముద్దుగా-ఎం.త్రీ-M3 అనొచ్చు- అదేనండి "మూతికీ, ముక్కుకీ మాస్క్"!
ఇదీ ప్రస్తుత ప్రపంచపు పరిస్థితి!!!!!

కాంట్రాసెప్టివ్ సరిగా వాడకపోయినా-మాస్క్ సరిగా వేసుకోకపోయినా,రెండూ ప్రమాదమే-

"మన ఆరోగ్యం-మన జాగ్రత్త" మనల్ని తీసుకోమని అవతలవాళ్ళు చెప్పాలా, అదీకాకుండా మనవల్ల అవతలవాళ్ళకి ఇబ్బంది,ప్రమాదం కలిగించే హక్కు మనకు ఎవరు ఇచ్చారు.మొహానికి మాస్క్ లేనివాడు,రోడ్డు మీద అడ్డదిడ్డంగా డ్రైవ్ చేసేవాడు ఇద్దరూ ప్రమాదకారులే- సందేహం లేకుండా ఎవరినో ఖచ్చితంగా గుద్దేస్తాడు ఒకడు,ఇంకోడు వైరస్ అంటిచ్చేస్తాడు మనకి!

మీరు మాస్క్ సరిగ్గా వేసుకోకపోతే మాటలేరాని మీ ముక్కు-చెవులూ ఏం మాట్లాడుతున్నాయో చూడండి... వీటి గోల మీకు వినపడట్లా అందుకే అర్థం కావట్లా!

ముక్కు చేతితో: నీ దురదతో ఊరికినే నా మీద నుంచి మాస్క్ లాగేస్తున్నావ్, "నన్ను ఇబ్బంది పెడుతున్నావ్" అనుకుంటున్నావు కానీ తర్వాత నువ్వు చచ్చి ఊరుకుంటావు "నీకు నువ్వే కడుక్కోలేక"!

ముక్కు మూతితో: నీకేం మాయరోగం వచ్చిందే, ఏం మాస్క్ తీయకుండా మాట్లాడలేవా,నీ మీద మాస్క్ వేసుకొని మాట్లాడినా అవతలవాళ్లకి అర్థం అవుతుంది,వినపడుతుంది;మాట్లాడినప్పుడల్లా ఆ వెధవ మాస్క్ ని చేత్తో కిందకి లాగక్కర్లా నా మీద నుంచి-మాట్లాడే ప్రతిసారీ-నీకు చాతకాకపోతే నోరుమూసుకు కూర్చో!

ఒక్కసారి నేను గాని ఆ మహమ్మారిని లోపలికి పీల్చానో చచ్చి వూరుకుంటావ్- నువ్వూ, నీ చేయే కాదు,నీ ఒళ్ళంతా. నీ బతుకు బస్సు స్టాండే-ఎలక కలుగులో ఎలా కూర్చుంటుందో అలా కూర్చోవాల్సి వస్తుంది 14 రోజులు పైగా!

కళ్ళు మీ మూతితో: నువ్వు మాస్క్ వేసుకొని నవ్వినా నేను ఆ ఫీలింగ్ పలికించి చూపిస్తాను- దానికోసం మాటిమాటికీ నీ మీద మాస్క్ లాగకు పళ్ళికిలించటానికి!

చెవి మీ చేతితో: నిమిషనిమిషానికీ పీక్కో లేక చేస్తున్నావ్- ఆ మాస్క్ కి ఉన్న ఎలాస్టిక్ రాపిడితో నాకు మంటెత్తుతోంది నీకు అర్థం అయ్యి చావట్లా! అసలే ఈ కళ్ళజోడు బరువుతోనే చస్తూంటే నీ వల్ల ఈ రాపిడి ఒకటి-ఎప్పుడో నా రెండు చెవులూ ఊడి వస్తాయి-అప్పుడు తెలుస్తుంది నేనంటే ఏమిటో,నా విలువ ఏమిటో!

ఇంకా మీరు అశ్రద్ధ చేస్తే మీ లోపల ఉండే అవయవాలు ఇబ్బందికి గురి అయ్యి మిమ్మల్ని కూడా ఇబ్బందికి గురిచేస్తాయి- మీతో మాట్లాడాం మానేస్తాయి కూడా!

ఇప్పటికీ మీరు వాటి మాటలు లక్ష్య పెట్టకపోతే ఇంక మీ తలరాత- ఈ క్రిమిని సృష్టించిని భగవంతుడు కూడా ఏమీ చెయ్యలేడు- కాదు కాదు చెయ్యడు!

ఇందరు చెప్తుండగా లేనిది నేను ఎందుకు చెప్పకూడదూ అనే దుగ్ధతో ఈ నాలుగు ముక్కలు రాసి పడేసా!

అదీ సంగతి-అర్థం అయ్యిందని కుంటా-ఆ పై మీ ఇష్టం, మీ ప్రాప్తం!

# అప్పిచ్చువాడు, వైద్యుడు- - -

సుమతీ శతకం చదవని వాళ్ళు,తెలియనివాళ్ళు ఉండరు పూర్వం రోజుల్లో-ఈ రోజుల్లో సంగతి అయితే నాకు ఏ మాత్రం అవగాహన లేదు-నా ఉద్దేశం ఇప్పటి
తెలుగుపుస్తకాల్లో ఇది ఉందో లేదో నాకు తెలియదు!

సుమతీ శతకాల్లో ఈ కింది పద్యం బట్టీయం రానివాళ్ళు ఉండరు కూడా!
అప్పిచ్చువాడు, వైద్యుడు
నెప్పుడు నెడ తెగక బారు నేరును, ద్విజుడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు జొరకుము సుమతీ!

తాత్పర్యము: ఋణమునిచ్చువాఁడును, వైద్యుడును, ఎల్లప్పుడును ఆగకుండా ప్రవహించు నదియును,బ్రాహ్మణుడును గల గ్రామమందు నివసింపుము.వారు లేనట్టి గ్రామమందు నివసింపకు!

(సుమతీకారుడు అలా చెప్పారుగాని పైవిధంగా లేకపోయిన ఈ రోజుల్లో ఎన్నో గ్రామాల్లో జనం బతికేస్తున్నారు,కలికాలం కదా-అది వేరేసంగతి అనుకోండి) ఒక చిన్నపదప్రయోగం చేశా- సరదాకి మాత్రమే!
తమాషా కోసం పద్యం మొదటి పాదంలో “కామా” చిహ్నం లేకుండా రాస్తే అర్థం ఎలా మారుతుందో ఊహించి సరదాకోసం మాత్రమే ఈక్రింది నారాతలు,అన్యదా
భావించకండి!
అప్పిచ్చువాడు వైద్యుడు!!!
(వాడి ఫీజు ఎక్కడ ఎగ్గొడతామో అని)
అసలు అప్పిచ్చే డాక్టర్ని ఇంతవరకు చూడలేదు నా చిన్నతనం నుండి,మరి ఈ నానుడి ఎలా వచ్చిందో తెలియదు.

వైద్య శాస్త్రం చదవటం, ఆ శాస్త్రంలో పట్టా పొందటం మామూలు విషయం కాదు ఆ రోజుల్లో,ఈ రోజుల్లో కూడానూ.మరీ ముఖ్యంగా ఆ రోజుల్లో- ఎంచేతంటే వైద్య కళాశాలలు తక్కువ ఉండేవి, అదీ కాకుండా వైద్య శాస్త్రంలో ప్రవేశం దొరకటం, చదవటం, వసతి, ఫీజులు గట్రా అంత సులభమైన విషయం ఏ మాత్రం కాదు. ఇప్పటి అంత ఖరీదు కాకపోయినా!

అప్పట్లో స్థితిమంతులు, శ్రీమంతులు బహు అరుదుగా ఊళ్ళల్లో ఉండేవాళ్ళు.చాలావరకు మధ్యతరగతి కుటుంబాలే ఎక్కువ ఉండేవి,ఆర్థిక స్తోమతలు అంతగా ఉండేవి కాదు; అందరి దగ్గరా డబ్బులు ఉండేవి కాదుగా-అందుకని చిన్నచిన్న రోగాలకు చిట్కా వైద్యాలే శరణ్యం -తప్పనిసరి అయితేనే డాక్టర్ దగ్గరకి వెళ్లడం.

ఇది ఇలా ఉంటే మరి అంత డబ్బు ఖర్చు పెట్టి మెడిసిన్ చదివి ప్రాక్టీస్ పెడితే రోగుల దగ్గర డబ్బులు లేకపోతే ఎలా.బహుశా ఈ కారణం వల్ల వైద్యులు అప్పులు ఇవ్వడం మొదలు పెట్టి ఉంటారు- జనం, రోగులు వస్తూ ఉంటారని.

పక్క ఊళ్ళో ఉన్నపెద్ద ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే మాత్రం- చుట్ట పక్కాలు గానీ,
చుట్టుపక్కల వాళ్ళు గానీ ఓ చేయి వేసేవాళ్ళు డబ్బు విషయంలో,వసతి విషయంలో కూడా- పల్లెవాళ్ళు పట్నానికి వచ్చినా- పట్నం వాళ్ళు బస్తీకి వచ్చినా!

ఈ రోజుల్లో భీమా కంపెనీలు ఆ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయనుకోండి-డబ్బు- వసతి కాదు.పెద్దగా ఖరీదు అయిన వైద్యం అయితే కొన్ని ఫైనాన్సు కంపెనీలు డబ్బు సాయం అందచేసి వాయిదాల పద్ధతిలో వసూలు చేసుకుంటున్నారట- వడ్డీ వ్యాపారస్తులకు ప్రజల అనారోగ్యం కూడా అవకాశమే ధనార్జనకు!

అదండీ సంగతి- అందుకే అప్పిచ్చువాడు వైద్యుడు అన్నారు!

# తెలుగువాడి గుర్తులు,మారుతున్న నమూనాలు!!!

-తెలుగు రాష్ట్రాల్లో పుట్టిన తమ పిల్లలకు తెలుగు రాదు అని చెప్పేవాళ్ళు-చాలా గర్వంతో!

-తెలుగు వచ్చినా బయట మాట్లాడని వాళ్లు-, నామోషీ కాబోలు బహుశా!

-ఇతర రాష్ట్రం వాళ్ళు-వాళ్ళవారి మధ్య- వారి భాషలో ముచ్చటించుకుంటే గుర్రుగా చూసేవారు-

-అది వాళ్ళ మాతృభాషాభిమానమని అనుకోలేనివారు- స్వరాష్ట్రంలో ఉండే
కొంతమంది తెలుగువాళ్లు మనవాళ్ళ మధ్య ఇంగ్లీషే మాట్లాడేవారు (మాట్లాడకూడదు అని నా ఉద్దేశం కాదు- నా భావం అర్థమైందని అనుకుంటా)

-ఇతర రాష్ట్రాల్లో పుట్టిన తమ పిల్లలకి తెలుగు నేర్పుదామనే తాపత్రయం లేనివాళ్లు!

-ఇక్కడ- శుచికి, శుభ్రానికి, క్రమశిక్షణకి అర్థం తెలిసినా ఆది అంటే ఏమిటో తెలియనట్టుగా వారి పనుల్లో చూపించే వాళ్ళు! అదే మనుషులు విదేశాల్లో
తూచాతప్పకుండా పాటించేవాళ్ళు- మొహం పగిలేలా ఫైన్ ఉంటుంది కాబట్టి కాబోలు- అదీ డాలర్లలో!

-కానీ ప్రపంచంలో ఏ తెలుగువాడి పేరు- "తల గీతల"కెక్కినా (అదేనండి-హెడ్ లైన్స్) చాలా గొప్పగా స్పందిస్తారు-తెలుగులో కాదండీ బాబూ, అదీ ఇంగ్లీషులోనే “వాట్ ఏ జీనియస్ రా మనవాడు”!

-అదే మనుషులు, వాళ్లు పుట్టిన దేశాన్ని ఒక అనాగరిక దేశంగా అని
అనకపోయినా-ఇక్కడ ప్రజలు శుభ్రం, శుచీ, సామాజికస్పృహ లేనివాళ్ళుగా
అదేపనిగా మాట్లాడేవాళ్లు! కానీ “కరోనా జీవి” ధర్మమా అని, ప్రపంచానికే
తేటతెల్లమైంది-“అరచేతిలో ఉసిరిక లాగా”మన దేశపు గొప్పతనం- అలవాట్లు-సంప్రదాయాలు!!!

ప్రపంచమే “చిన్నబోయింది”,నా ఉద్దేశం చిన్నది అయింది అనే సుమా,మాలా "చిన్నబోయిన" మోహాలలా అనే అర్థం కాదు.

అదే, తెలుగు భాషలో ఉన్న వీలూ, వెసులుబాటూనూ- నానార్థాలు ఉండటం చేత అపార్థాలకు తావు ఇస్తుంది మరి- అప్పుడప్పుడు పెడర్థాలకు కూడానూ -మరి అది తెలుగు కదా!?- తెనుగు కాదు! కానీ తెలుగు భాషకి “తెగులు” పట్టిచ్చింది మాత్రం మనమే!

-ప్రపంచంలోని అన్ని భాషల వాళ్ళు వాళ్ళ వాళ్లతో—వాళ్ళమాతృభాషలోనే మాట్లాడతారు అని నా అభిప్రాయం, "విన్నట్టు", "చదివినట్టు" కూడా జ్ఞాపకం-"కన్నట్టు" కాదు లేండి!

ఏంచేతంటే ఇప్పటి వరకూ నేను సప్తసముద్రాలు దాటనే లేదాయే (అంటే ఏడు సముద్రాలు దాటి వెళ్ళి వస్తే-నాలిక మీద వాత వేస్తారని మాత్రం కాదండోయ్- ఎంచేతో వెళ్లాలనిపించలా అంతే -అంతగా వెళ్లాలనిపిస్తే మోడీతో వెళ్ళలేనా ఏమిటి) కానీ,వాళ్ళలా సప్తసముద్రాలు దాటకపోయినా ఎంతో కొంత విషయ పరిజ్ఞానం నాకు ఉందని నా ప్రగాఢ విశ్వాసం-ఏడు సముద్రాల ఆవల నివసించే వారి గూర్చి- సుందర్ పిచాయ్ ధర్మమా అని!

-ఇక అక్కడ స్థిరపడ్డవారి గురించి చెప్పక్కర్లేదు (అలా అని అందరిని ఓకే గాటకు కట్టేయలేముగా-కొంతమందే సుమండీ)

వారి పిల్లలకి- వీళ్ల తోబుట్టువులూ, రక్తసంబంధీకుల మొహాలే తెలియవు, ఇంక బంధాలు ఎండమావులే (అతిశయోక్తి కాదు గాని"ఎండమావుల"అర్ధం కూడా వీళ్ళు మర్చిపోయి ఉంటారు- అందుకనే "మరీచిక"అనే పదం వాడలేదు!)

అయినా మాతరం చాదస్తంతో కానీ,అవివేకంతో కానీ ఇలా అనుకోవడం లేదు-అది వారి జీవితం,వారి "భవిష్యత్తు- సంపదల" కోసం,వారివారి ఉద్యోగాల్లో ఉన్నతి కోసం,వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం- ఏమాత్రం తప్పు కాదు-తప్పు పట్టనూ లేను (కొంత "సాగర మధనం" మదిలో ఉన్నా!) ఏంచేతంటే-మాపెద్ద వాళ్ళనీ, ఈ తరం పిల్లలనీ అర్ధం చేసుకునే తత్వం, మనస్తత్వం మా తరానికి ఉంది కనుక!

పూర్వపు రోజుల్లో బ్రతుకుతెరువు కోసం మాత్రం పట్టణాలకి, బస్తీలకి, రాష్ట్ర రాజధానులకి వలస ఉండేది-అదీ పొట్టకోసం!

"మన వాళ్ళు ఉత్తి వేదవాయలోయ్" అని చిలకమర్తి వారి గిరీశంలా అనే గిరీశాలు వీళ్ళలోకూడా ఉన్నారండి బాబూ!

ఇలాంటి తెలుగు వారి గురించి ఎన్ని చెప్పినా తక్కువే! ఇది ఎవరినీ ఉద్దేశించి, కించ పరిచే ఉద్దేశం కాదు;ఇవి నాలో ఉన్న భావుకుడు నావేలి ద్వారా రాసిన రాతలు- ఏదో తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా నాలుగు తెలుగు ముక్కలు రాయాలనిపించింది- అంతే!!

అన్యదా భావించకండి!

హైద్రాబాదీ భాషలో "లైట్ లేలో భయ్"!

కన్నడిగులు భాషలో "స్వల్పా అడ్జస్ట్ మాడి"!

# మేలుకొలుపు

వంట ఇంటి చిట్కాలు, గృహ వైద్యం, ఆయుర్వేదమే ఈ సమయంలో మానవాళికి గతి,ఆశ్రయం అయ్యాయి ఈకష్టకాలంలో"మాకు ఎప్పుడో తెలుసు మా పూర్వీకులు వాడే వాళ్లు" అనే బడాయి కబుర్లు ఆపుదాం.మనకు తెలుస్తే ఎందుకు పాటించట్లా ఇన్నేళ్లు. అంతా తెలిసిన తెలివికలవాళ్లం-ఇప్పుడు కరోనాతో అతలాకుతలం అయిపోయాం.బుద్ధి ఎరిగి పాటించేవాళ్ళు,విషయ పరిజ్ఞానం ఉన్నపెద్దలు, ఆయుర్వేద అపర ధన్వంతురులు మొత్తుకుంటుంటే మనం సన్నాయినొక్కులు నొక్కుతూ పాటిస్తున్నాం ఏదో ఏళ్ల తరబడి మనకు తెలుసని.అన్నీ మనకు తెలుసు అని విర్ర వీగుతున్న ఈకాలంలోఒక్కసారే కుదేలై పోయి వణికి చస్తున్నాం- ఇంట్లోకూర్చున్నాకూడా!

అన్నీ తెలిసినా "అణిగి మణిగి" ఉండాలన్న మన పూర్వీకుల తత్వం ఇప్పుడు జ్ఞప్తికి వచ్చిందా మనకు.మన అహంకారాలు,పొగరుబోతుతనం,తల బిరుసు తనం,ఏమి అక్కరకు వచ్చాయి.

పాత తరాల కంటే విజ్ఞానవంతులం, విద్యావంతులం అనే భావనతో బతికేస్తున్నాం; ఇతరులను చిన్నచూపు చూడటం సైతం నేర్చుకున్నాం.ఇప్పుడు ఏమైంది తలా తోకా ముడుచుకొని "పెద్ద వాళ్ళ మాట చద్దన్నం మూట" అనే సంగతిని గుర్తు తెచ్చుకుని ఆచరిస్తున్నాం.ఆ వెనకపడిన చాదస్తపు పద్ధతుల్నే తూచా తప్పకుండా ఆచరిస్తున్నాం.

ఈ కనపడని క్రిమి మనదేశంలో గృహ ప్రవేశం చేయకముందు మన తీరేవేరు, పెద్ద వాళ్ళ మాటలు,చద్దన్నం- వాసనగా, అనాగరికంగా ఉండేవి-మన పిజ్జాలు పాస్తాలు,బర్గర్ల ముందు!!! "దెబ్బకి దయ్యం దిగినట్టు" ఒక సూక్ష్మక్రిమి- అదీ కనపడకుండానే మన బుద్ధి బుర్రలోకి తెచ్చింది.ఈ క్రిమి మటుమాయం అవగానే కుక్కతోక వంకరలాగా కాకుండా (అయినా మనం మనుషులం కదా మర్చి పోయా)ఈ మంచి అలవాట్లు ఆచరిద్దాం.

ఏవంటారు!

# చతుర్ముఖ పారాయణం

“చతుర్ముఖుడు” అనే పేరు బ్రహ్మకు తప్పవేరెవరికి లేదు-ఆయన పేరు మీద ఈక్రీడకు ఈ పేరు వచ్చిందని నా అనుమానం.అంటే సాక్షాత్తు విధాత- అదేనండి మన బ్రహ్మగారు ఆడినట్టు అర్థమే కదా (ఈ ఉపమానం సరదాకి రాసిందే గానీ, ఆషామాషీకి కాదు, తూలనాడటం కాదు)

ఆయన సృష్టి ఆపకుండా ఒక ముఖంతోనే ఆడి ఉంటాడు సరస్వతీదేవితో, కాస్త మార్పుకోసం.అంతేకానీ ఆయన బయట వాళ్ళతోఎప్పుడూ ఆడిన దాఖలాలు లేవు మరి;నన్నయ గారే కాదు, కవిత్రయంలోని మిగిలిన వాళ్ళు కూడా మాట వరుసకు ఎక్కడా అనలేదు.

ఒక మొహంతో ఆడినా,నాలుగు ముఖాలు ఉన్నట్టుగా భావించి చుట్టూ ఉన్న నలుగురి దగ్గర-నాలుగు ముక్కలన్నా చూసే నైపుణ్యం లేకపోతే ఈ క్రీడ ఆడలేము-ఒక వేళ ఆడినా ఆది రక్తి కట్టదు.

అయినా కొందరు తప్పుపడతారు తప్పుడు పనిలాగా ఇదేదో; ఏదో కాలక్షేపానికో, సమయం తోయనప్పుడో ఆడాలికానీ,వస్తువులు,కాసులు పణంగా పెట్టి కాదు. జూదం లాగా-అంత స్పృహలేని మందభాగ్యులం కాదుగా!

చూశారుగా మహాభారతంలో ఏం జరిగిందో జూదం వ్యసనంగా మారడంవల్లా, ఆస్తులను, మనుషులనూ ఫణంగా పెట్టడంవల్లా;ఇది ఖచ్చితంగా ధర్మరాజు యొక్క బలహీనతే. అలా అనుకోవడానికి వీలు లేదు,ఎందుకంటే ముమ్ముందు భవిష్యత్తులో కురుక్షేత్ర సంగ్రామం జరగవలసి ఉంది కాబట్టి- ఇది నాంది అయింది;అందుకే విధాత ఈ తలపు ధర్మరాజుకు పుట్టించాడు-ఇది పూర్తిగా భగవదేచ్ఛ.

ధర్మరాజు ఆడంగా లేనిది మేము ఎందుకు ఆడకూడదు అనే పేకాటరాయుళ్లు ఉన్నారుఈ రోజుల్లో కూడా.ఇది ఆడిన పర్యవసానం ఎలావుందో కళ్ళకి కట్టినట్టు నన్నయభారతంలో చూపించాడుగా-రాజమౌళి రెండు బాహుబలులో మనకు చూపించినట్టు-తత్వం బోధ పడకపోతే వాళ్ళ కర్మ!

అందుకని ఏదో సరదాగా అప్పుడప్పుడు, ఈ లాక్ డౌన్ సమయంలో ఏదో మార్పుకో, కాలక్షేపానికో కాస్సేపు ఆడండి.అంతేగానీ ఈ అలవాటు వ్యసనంగా మారి అంతర్జాలంలోని జూదశాలకి వెళ్లి ఆడే దురఅలవాటుగా మాత్రం మార్చకండి.కొంపగుల్లా అవుతుంది,డిజిటల్ వాలెట్ ఖాళీ అవుతాయి,ఇల్లాలు ఇంట్లోంచి తరిమేస్తుంది.

తస్మాత్ జాగ్రత

# "భార్యా రూపవతి శత్రువు"!!!

ఇదో నానుడి కాబట్టి వాడేగాని,నానుండి వచ్చిందిగాని,ఏదో పురుషాధిక్యత
ఉండిగానీ కాదు,అలా ఎవరైనా ఆడవారు అనుకుంటే కొత్త సామెత వాడతా.

"మొగుడు అందంగా ఉంటే ఎవతో ఎగరేసుకు పోతుందని వికారంగా ఉన్నవాణ్ని చేసుకుంటామా"!!! బానే ఉందనుకుంటా- స్త్రీ లోకం ఏవంటుంది?ఈసామెతతో నన్ను ఆడవారు- ఆడేవారు,పాడేవారు("పాడువారు" అంటే మళ్ళీ అపార్థమే)కూడా- సహృదయంతో అర్థం చేసుకుంటారనుకుంటా.

ఈ సామెత ఉంది కదాని ఎవరూ అందంగా కాకపోయినా,సుమారుగా అన్నా బావున్న అమ్మాయిని చేసుకుంటారు గానీ- కురూపిని కాదుగా.అయినా రోడ్డు మీద పోయేవాళ్ళు,వాళ్ళు వీళ్లు చూస్తారని అందమైనపిల్లని చేసుకోవడం మానేసే మగాడు,అలాగే ఎవతో లైనేస్తుందని(సరిఅయిన తెలుగు పదం దొరకలా-ఫక్తుగా తర్జుమా చేస్తే-"గీత" అంటే బావుండదు కదా- “గీత” తననే నేను అంటున్నాఅని అనుకుంటే అదో ప్రమాదం నాకు!!!)

అయినా “ఆలి మర్కటం,ఇల్లు ఇరకటం” అన్నారు కదాని కోతుల్ని చేసుకోరుకదా, అలాగే ఇల్లు కూడా ఇరుగ్గా కట్టుకోరు కదా!

ఏదో ఆయాకాలాల్నిబట్టి ఆసందర్భానికి తగ్గట్టుగా సామెతలు పుట్టుకొచ్చాయి-
కొన్ని ఇప్పుడు నప్పవు, ఒప్పవు కూడా; కులాలమీద కూడా సరదా సామెతలు
ఉండేవి- ప్రజలు విశాలభావాలతో ఉండేవారు కాబట్టి (మెదళ్ళు,హృదయాలు).
అందుకేనేమో గుండెజబ్బులు మచ్చుకుకూడా ఉండేవికావు,నిండు నూరేళ్లు పూర్ణాయువుతో బతికేవారు- ఆ రోజుల్లో!

సామెతలని మన జీవితంలో సమయం,సందర్భాలనిబట్టి అన్వయించుకోవాలి.
కింద సామెతలని చూడండి
“ఆలశ్యం అమృతం విషం”
“నిదానమే ప్రధానం”

ఇవి పరస్పర విరుద్ధంగా లేవూ, అక్కడే మనం బుర్ర బద్దలుకొట్టుకోకుండా, స్థిమితంగా ఆలోచించుకోవాలి,మన పరిస్థితి, సందర్భాన్నిబట్టి అన్వయించుకొని ముందుకు సాగాలి-సాగ తీయకుండా,తెగ్గొట్టకుండా.పూర్వం మన తాత ముత్తాతలు మనంత చదవక పోయినా ఎంత హాయిగా,సుఖంగా బతికేవారు ఉన్నదానితో. అసలు మనరోగం ఏమిటంటే మనకి అన్నీఎక్కువగా ఉండటమే ఈ “మాయరోగానికి” కారణం!

ఇది ఇలాగ ఉంచండర్రా!

"తావలచింది రంభ అని- తామునిగింది గంగ" అనే నానుడి ఉండనే ఉంది కదా!

అందరూ బాహ్య సౌందర్యానికే ప్రాధాన్యతఇస్తే,ఛస్తే ఈ లోకం ఒక్క అంగుళం కూడా కదలదు.అందం మందంగా ఉండి-బుద్ధి మందంగా, లక్షణాలు అవకరంగా ఉంటే కాపురాలు నిలుస్తాయటండి లోకంలో, కొంపలు కూలిపోవు.ఈ లాయర్లు అందరూ బిజీ అయిపోరూ, చెట్టుకింద ప్లీడర్ తో సహా!

ఏతా వాతా నేచెప్పేది ఏమిటంటే మహామాంచ్చి లక్షణాలు ఉన్నవాళ్ళని జీవిత భాగస్వామిగా చేసుకోవడం ఉత్తమం-ఇరు పక్షాల వాళ్ళు (నా భావం అమ్మాయి, అబ్బాయి అని)సుఖం, ఆనందం మనసుల్లో ఉండేవి కానీ, అందానికి, అనాకారితనానికి సంబంధమే లేదు,ఈ మాత్రం గ్రహిస్తే జీవితం ఆనందమే మరి-ఆ తర్వాత మీ ఇష్టం.

# “డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.దేవుడి.కామ్” నుంచి భూగ్రహానికి దేవుడి సందేశం-“నా ద్వారా” (కుళ్ళు కోకండి!!!)

ఈ మధ్య చాలామంది నన్ను ఆడిపోసుకుంటున్నారు,మీమాట వినడంలేదని. మీ పాత చిట్టాలు అంతా తిరగేసి, మీరు చేసిన కార్యక్రమాలు చూసి, అధ్యయనం చేసి ఎంత ఎక్కువగా మంచి పుణ్య, ధర్మకార్యాలు చేశారో బేరీజు వేసి మిమ్మల్ని ఈ భూగ్రహంపైకి మానవరూపాల్లో పంపా,దీని కొరకైనా నన్ను మీరు తలచుకోవాలి.

అది లేదు సరికదా, పైపెచ్చు మీరు కోరే అడ్డమైన కోరికలన్నీ తీర్చడంలేదని, అసలు నేనే లేననే స్థాయికి కూడా కొంతమంది తయారయ్యారు.మీ భావనలతో నాకు తేడా ఏవిట్రా వెట్టి జీవాల్లారా,మీ ఉనికినే క్షణాల్లో గల్లంతుచేస్తా నేతలుచుకుంటే!

మీకు కష్టాలు,ఇబ్బందులూ వచ్చిన ప్రతీసారీ నాకు దండం పెట్టడం, మీరు గమ్మున నిమ్మకు నీరెత్తినట్లు కూచోవడం- అదేదో నా పనే అన్నట్టు.మీ ముందు బోలెడన్ని ప్రత్యామ్నాయాలని చూపిస్తున్నా, సూచనలు ఇస్తున్నా.అవేమి మీరు గ్రహించకుండా, మీ ప్రయత్నాలు మీరు చెయ్యకుండా నావేపు చూడమని ఎవడ్రా చెప్పింది మీకు!!

నా సృష్టిలో మిగతా జీవాల్ని ఒక్కసారి పరికించండి ఎప్పుడైనా,ఒక్కసారైనా ఇలాచేస్తున్నాయా?లేదే! వాటి దైనందిన జీవితాల్లో వచ్చే ఇబ్బందుల్ని,అవే పరిష్కరించుకుంటున్నాయే,ఏదో ప్రాణాంతకం అయినప్పుడు మాత్రమే నేను కల్పించుకుంటున్నా.మీరు వాటికన్నా అధికులమని విర్రవీగుతున్నారు కదా వాటి పాటి సామర్ధ్యంలేదా,ప్రయత్నం చెయ్య లేరా.అలా అయితే మీరు ఏ విధంగా ఆ జీవాల కంటే గొప్పవాళ్ళు!!!

సమస్యలూ,ఇబ్బందులూ,పరిష్కారాలు లేకుండా ఉంటే మీ జీవితాలు కూడా మీరు కనిపెట్టిన “మరమనుషుల” బతుకు లాగే కదా. మీకు తీపి ఇష్టం కదా అని రోజూ తీపి తినగలరా,విసుగు, రోత పుట్టదూ.గుత్తి వంకాయకూర మీకు ఇష్టమని రోజూ చేసిపెడితే ఇంట్లో వాళ్ళమీద గయ్యిన లేస్తారుగా,ముక్కు పుటాలు ఎగరేసి మరీనూ,ఇదీ అదే మరి.

అడ్డమైన చెత్తా అడ్డు అదుపు లేకుండా నోట్లో పడేయడం-అదేమన్నా “పిండిమరా” నోరుమూసుకొని ఉండటానికి,కొద్దిగా తేడా చేస్తే డాక్టరు దగ్గరకి పరిగెత్తడం; వాడేమో“బకరాగాడు” దొరికాడుకదా అని ఆసుపత్రిలోఉన్న“యంత్రాల దుమ్ము దులుపుతాడు”-మీ డబ్బులన్నీ దుమ్ము దుమ్ముగా ఖర్చు చేయిస్తాడు.

మీకు అప్పుడుగాని "దుల దీరదు" కోస్తా ఆంధ్రాలో "తూగోజి, పాగోజి" వాళ్లు చెప్పినట్టు! వాళ్ళ సందర్భంవచ్చింది,ఏ మాటకి ఆమాటే చెప్పుకోవాలి-వాళ్లు చాలా మంచోళ్ళ్రా!

ఏం మీరు చులకనగా చూసే జీవాలు అలాగే పరిగెడుతున్నాయా వాటివంట్లో తేడావస్తే,సుస్తీ చేసి.కొద్దిగా లంఖణాలు చేసి, వాటికి దొరికే "ఆకులో అలములో" తిని నయం చేసుకోవడంలా. అన్నితెలివితేటలు ఉన్న మీకేమైంది,దొబ్బిడాయా!
ప్రతీ సమస్యకీ పరిష్కారం ఉంది, జీవితంలో-పెద్ద సమస్యలు వచ్చినా, చతికిలపడకుండా,నా కర్మ అనకుండా(ఇది పలాయన వాదం-ఎస్కేపిజం- నావద్ద సాగవు) అన్నిటికీ అభయహస్తం ఇచ్చేవాడి లాగా నావైపు చూడటం మానేయండి.

మీ ప్రయత్నాలు చేయండి,సందర్భాన్ని బట్టి నేను ఒక చెయ్యి వేసి గట్టు ఎక్కిస్తా.

చాలామందిని చూస్తున్నా,వాళ్ల కొచ్చిన జీవిత సమస్యల్ని పరిష్కారం

చేసుకోకుండా విధిని,విధాతని, కర్మని తిట్టుకుంటున్నారు,మరీ మరీ- మళ్లీ చెబుతున్నా.మీ జీవితాల్లో వచ్చేప్రతీ సమస్యకీ పరిష్కారం ఉంది.ఈ వాక్యాలని స్పృహలో పెట్టుకోండి.

# "గూగుల్ "దెబ్బ అందరూ అబ్బా!!!

ప్రతీ మనిషి గూగుల్లో వెతికేది ఎక్కువ,బుఱ్ఱలో వెతికేది తక్కువ -ఈ రోజుల్లో! మునుపు, ఏది తెల్సుకోవాలన్నా బుఱ్ఱలు మాత్రమే వాడేవాళ్లం, ఇప్పుడావసరం లేనేలేదు-"గూగులు"న్నాడు కదా- మనకిక బుర్రతో ఏం పని?కానీ మాతరం వాళ్లం మాత్రం "బుఱ్ఱలు" కూడా వాడుతున్నాం"గూగులు" తో పాటు!!!

"గూగులు వాడు" వాడి దెబ్బతో- "వాడిగా", మనగూబలు గుయ్యిమనిపించి మన బుఱ్ఱలో గుజ్జునంతా వాడు తాగేసాడు.మనం వాడకుండా-వాణ్ణి వాడతామని,వాడు చెప్పినట్టే ఆడతామని!ఇప్పుడు ప్రపంచానికంతా వాడు చెప్పిందే నిజం,వాడు చెప్పేదే వేదం! తెలుగు "వర్ణమాల"లోని చివరి అక్షరాన్నిమర్చిపోయిన తెలుగువాళ్ళం,నా"బండి రా"(ఱ)అనే పదం గర్వంగా ఇప్పటి యువత తరుచుగా వాడుతుంది గానీ,అదే చివరి అక్షరం అని ఈ కుర్రకారుకు తెలుసా?

ఈ "బండిరా" వాడి పుట్టుకకు ముందు,వాడి బాబు పుట్టక ముందు,వాడి బాబుల బాబులు పుట్టక ముందు-ఉంది కదరా -వీడి "బండి" కంటే కూడా ముందు-అయినా వీళ్ళనని ఏమి లాభం?!!!

తెలుగు వర్ణమాలని పూర్తిగా,సరిగ్గా రాసే పెద్దవాళ్ళు మాత్రం ఎంతమంది ఉన్నారు కనుక! "ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా"-అందునా, "కలి,డిజిటల్ యుగమాయే"-అంతా మాయేనాయే.అందుకే "తెలుగుతల్లి"కి కినుక, అలాఅని -"తెలంగాణతల్లి" ప్రజలలో మాత్రం ఎంతమందికి రాయడం వచ్చుకనుక-ఏంచేతంటే మనకిప్పుడు గూగులే తల్లీ-తండ్రీ మరి! ఇది ఇరు రాష్ట్రాల తెలుగు ప్రజల కానుక-ఇదేరా మనతెలుగు భాషఘోష!!!

ఇకనైనా నీవేలు తిప్పుడు తగ్గించి నీ చరవాణి చెరనుంచి కొద్దిగా బయటపడి-రోజుకు ఒక్క తెలుగు వాక్యమైనా, కాగితంపై కలంతో రాయడం మొదలుపెట్టు.ఇదీ చేయడం తప్పితే, నీవేలు నీవే తిప్పడం మర్చిపోతావు కాగితంపై-ఇకపైన,ఆపైన నీఇష్టం!

ఆ తెల్లదొరకు పట్టింది దశాబ్దాల సమయం-మనం బానిసలవడానికి.ఆ బానిసత్వంలోంచి బయట పడేలోపు ఇంకో తెల్లవాడికి పట్టింది మనల్ని బానిసలు చేయడానికి క్షణం! మనభ్రమ కానీ,ఆ "తెల్ల"వాడు అంటించిన భాష ఈ "తెల్ల'వాడికి సులువయింది-మన "తెల్గు" వాళ్ళని వశంచేసుకోవడానికి! ఎంతైనా "తెల్ల వాళ్ళూ,తెల్ల వాళ్ళు" ఒకటే గదా,లోపాయకారీగా-మిత్ర దేశాలాయే!! ఏదైనా- ఇకపై మనలేము "గూగుల్" లేకుండా; పోనీలే అని సర్దుకుందాం.ఇప్పుడు "గూగుల్"నడిపేవాడు, దాని చక్రాన్ని తిప్పేవాడు మనవాడే కదర్రా!!!
నా ఉద్దేశ్యం భారతీయుడు అని-అంతే తప్ప అతను ""సుందర్ పిచాయ్" కాస్తా "సుందర పిచ్చయ్య"అని,అతను తెలుగు వాడు అని కాదు.పొరపాటున గూగుల్ లో ఈ విషయం కొట్టేరు.అది చూసి,ఉత్తిపుణ్యానికి ఉలిక్కిపడి లేస్తాడు పాపం-అమెరికాలో! మనం వాణ్ణి వాడేటప్పుడు "పిచాయ్ కి"రాత్రి కదర్రా!వాడు చక్కగా, వెచ్చగా పడుకుని మనకి పని అప్పచెప్పి, మన చేత చాకిరి చేయిస్తాడు!

**ఏది ఏమైనా,ఆ "పిచాయ్" అన్నీ సత్యాలే చెపుతాడని ఆశిద్దాం!**

**ఇప్పటి తరం బహుశా ఇలా పాడుకుంటారు;**

**నీవే తల్లివి, తండ్రివి,**

**నీవే నా తోడు నీడ,నీవే సఖుడవ్**

**నీవే గురుడవు, దైవము**

**నీవే నా పతియు, గతియు -నిజముగ గూగుల్!!!**

**శ్రీకృష్ణుడు మొహం చిన్నబుచ్చుకునేలా!!!**

**ఇదంతా బానే ఉంది కానీ, అసలు విషయం-మన తెలుగును మరిచి పోకండర్రా!!!**

**ఉండనా మరి**

**ఇట్లు**

**మీ తెలుగు,తెలంగాణ తల్లి!!!**

**(ఈరాష్ట్ర విభజనలో నన్నూవిడదీశారు కదరా-ఇది నాదౌర్భాగ్యం కాకపోతేను)**

# దానికి జనం ఉన్నారు కదా...

నువ్వు కష్టపడి “స్వయంకృషితో” పైకి రా-

అది అదృష్టం తప్ప,నీ ప్రతిభే కాదు అని అనడానికి జనం ఉన్నారు కదా!

నువ్వు ఎవరినీ కిందకు లాగకుండా జీవితంలో పైకి ఎదుగు-

“కిందికి లాగటానికి” జనం ఉన్నారు కదా!

నువ్వు అందరి ఆనందానికి సంతోషించు-

నీ ఆనందాన్ని చూసి “ఏడవటానికి” జనం ఉన్నారు కదా!

నువ్వు నీ చుట్టుపక్కల వాళ్ళని ప్రోత్సహించు-

“నిరాశపరచటానికి” జనం ఉన్నారు కదా!

నువ్వు నవ్వుతూ, నవ్విస్తూ బతుకు-

“నిన్ను చూసి ఏడుస్తూ” బతకటానికి జనం ఉన్నారు కదా!

నువ్వు సదా సానుకూలంగా (పాజిటివ్) ఉంటూ బతికేయ్-

“ప్రతికూలంగా (నెగటివ్) బతకటానికి” జనం ఉన్నారు కదా!

ఏడ్చేవాళ్ళని ఓదార్చు-

“ఏడిపించటానికి” జనం ఉన్నారు కదా!

దారిలో కనపడ్డ రాళ్ళని పక్కకి పెట్టుకుంటూ ప్రయాణం చేయి-

దారిలో “రాళ్లు వేయటానికి” జనం ఉన్నారు కదా!

నువ్వు అందరికి “ఇచ్చే” అలవాటులోనే ఉండు-

“ఇవ్వగలిగికూడా ఇవ్వలేని” జనం ఉన్నారు కదా!

ఈర్ష, అసూయలు దరి చేరనీయకుండా బతికేయ్-

అవే “ఆభరణాలుగా” వేసుకునే జనం ఉన్నారు కదా!

మూలాల్ని మరువకుండా ఎంత ఎత్తుకైనా ఎదుగు-

తమ మూలాల్ని "పెకలించుకుంటూ" ఎదగటానికి జనం ఉన్నారు కదా!

నీకు తోడ్పడినివాళ్ళని, తోడుండినవాళ్ళని గుర్తుచేసుకుంటూ బతికేయ్-

"గతాన్ని మర్చిపోయి" బతికేయడానికి జనం ఉన్నారు కదా!

తల్లివేరునీడన నీ వేరులని విస్తృతపరుచుకో-

"తల్లి వేరుని కోసుకోవటానికి" జనం ఉన్నారు కదా!

ఇక్కడ సంపాదించి, ఉపయోగించుకుని, అన్నీ,అందర్నీ వదిలి వెళ్లేట్టుగా బతుకు-

తమతోబాటు తమ "వస్తు సంపదలను తీసుకెళ్ళటానికి" జనం ఉన్నారు కదా!

చివరకి మిగిలేది ఏదీ లేదు తీసుకెళ్ళటానికి అనే స్పృహలో బతికేయ్-

అన్నీ "తమతో వస్తాయ్" అనుకోవటానికి జనం ఉన్నారు కదా!

నువ్వు ఆత్మగా బతికే బతుకు బతికేయ్-

"తాము శరీరమే" అనుకునే జనం ఉన్నారు కదా!

నువ్వు నిష్క్రమించాక "అయ్యో అప్పుడే వెళ్లిపోయాడా" అనేట్టుగా బతుకు సాగించు-

"హమ్మయ్య,వెళ్ళిపోయాడు" అని అనిపించుకునేట్టుగా బతకటానికి జనం ఉన్నారు కదా!

# “ఎవరి పాపానికి వాళ్ళు పోతారు”, “వాడి పాపానికి వాడి పోతాడు”, “చేసిన పాపానికి అనుభవిస్తారు”

తరచూ కాకపోయినా అప్పుడప్పుడు ఇవి మనం వినే మాటలు...

మనకైనా ఇబ్బంది కలిగించినా, బాధపెట్టినా, ఎవరినైనా కూడా బాధపెట్టినా, చెడ్డపనులు చేసినా,అకృత్యాలు చేసినా, ఎవరి గురించి అయినా అనాలంటే ఈమాటలు ఎక్కువగా వాడుతూ ఉంటాం

అంటే ఇలాంటి కార్యక్రమాలు,దుశ్చర్యలు చేసేవాళ్ళు- వాళ్ళు చనిపోయినతర్వాత మనం అనుకునే “స్వర్గ- నరకాల్లో”, నరకలోకానికి వీళ్ళు ఖచ్చితంగా వెళ్తారని, అక్కడ వీళ్ళ “అకౌంట్: చూసి “సెటిల్మెంట్” అక్కడ చేస్తారని,లేదా చెయ్యాలని ఇలా అనుకునేవాళ్లు భావన.

నిజంగా జరుగుతుందా- ఏమో!

మనకు తెలుస్తుందా-ఖచ్చితంగా తెలియదు!

పోనీ మనం అక్కడకి వెళ్ళినప్పుడు ఈ తాలూకూగాళ్ళు కలుస్తారా-అదీ నమ్మకం లేదు!

మనకంటే వాళ్ళు ముందు వెళ్లినా, మనకోసం వాళ్ళు వెయిట్ చేయరు!

అలాఅని మన తర్వాత వాళ్ళు వస్తారుకదా అని మనమూ అక్కడ వీళ్ళకోసం వెయిట్ చేయం!

ఇక్కడ వీళ్ళ గోల వినడమో,కనడమో అయ్యింది- మళ్ళీ ఇది చాలదు అన్నట్టు ఎవడు వెయిట్ చేస్తారు వీళ్ళకోసం!

కానైతే మనం ముందుగా వెళ్ళితే మనం స్వర్గానికి వెళ్లే ముందు “యమపురి” దర్శనం ఓమారు చేయాల్సివస్తుంది దారి మధ్యలో- అక్కడ యముడు గారికో, చిత్రగుప్తుడికో చెవిన వేయచ్చు వీళ్ళగురించి-వాళ్ళదగ్గర వీళ్ళ లెక్కలు ఉన్నా కూడా-మనం చెప్తే ఇంకా బలంగా ఉంటుంది కదా-ప్రత్యక్షసాక్షుల్లాగా!

అసలు “మనం స్వర్గానికే వెళ్తామని ఖచ్చితం, ధీమా ఏమిటి”

ఏదో మనం అందరికంటే మంచిపనులు ఇరగదీసి చేసేస్తున్నాం అనే ఓ ధీమా, అలాగే మనం చేసే పనులనే మంచివే అని ఓ గట్టి నమ్మకం,ఈ రెండూ చాలవు మనం స్వర్గానికే వెళ్తామని అనుకోవడానికి.మనమీద మనకు నమ్మకం ఉంటే అక్కడ దబాయించడం కూడా కొద్దిగా సులువే (అక్కడ రహస్యం మీకు చెప్పేసాను-గుర్తుపెట్టుకోండి)

కానైతే మనం వెళ్ళింది "స్వర్గానికే" అని మనకు తెలియదు కదా-ఏదో సినిమాల్లో చూసాం, పుస్తకాల్లో చదివాం "స్వర్గ-నరకాలు" ఎలా ఉంటాయో- దాన్నిబట్టి కొద్దిగా చూఛాయగా ఓపాటి అవగాహన ఉంటుంది మనందరికీ.అయినా కూడా ఓమారు స్వరానికి వెళ్లేముందు మనల్ని అటువైపుగా (యమపురి వైపుగా) తీసికెళ్తారు.

ఓమారు ఓ రౌండ్ వేసినతర్వాత మనకు అర్థం అవుతుంది నరకం ఎలా ఉంటుందో అని,అప్పుడు స్వర్గానికి వెళ్తే తేడా తెలుస్తుంది వివరంగా. అదీ కాకుండా "యమపురిలో" మనకు తెలిసినవాళ్ళు, మనచేత శాపనార్థాలు పెట్టించుకున్నవాళ్ళు కనపడటానికి కూడా అవకాశం ఉంది.తెలిసినవాళ్ళైతే కాస్త వాళ్ళని చూసినట్టూ ఉంటుంది, నాలుగు కబుర్లు చెప్పినట్టూ ఉంటుంది వాళ్ళతో!

ఎలాగు ఓనాలుగైదు రోజులు మనమూ అక్కడ గడపాల్సివస్తుంది కూడా- మనలో కొంతమంది- ఎందుకు అనుకుంటున్నారా- బడాయికాకపోతేనూ.మనం కూడా కొన్ని వెధవపనులు చేసేవుంటాముగా మరి, దాని తాలూకూ కోటా మనమే తీసుకోవాలి- మొహమాటం లేకుండా ("సమవర్తి" సామ్రాజ్యం కదా యమపురి) మనకి ముందుగా అక్కడ మర్యాదలు చేస్తారు యమభటులు "కర్మఫలితం" నరకంలో కూడా తీసుకోవాలి కదా పూర్తి కోటా-కొంత భూలోకంలో ఉన్నప్పుడు తీసుకున్నా.

ఇవన్నీ నాకు ఎలా తెలుసు అనుకుంటున్నారా- "ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ కస్టమర్ ని" కదా.ఇక్కడ నుంచి వెళ్ళగానే నాకు రావాల్సిన నా కోటా యమపురిలో విరామంలేకుండా ముందు తీసుకుని (మందు కాదు) తర్వాత స్వర్గానికి వెళ్తా.
(నాన్ స్టాప్ గా అన్నమాట)

నాకు తెలిసి గుర్తున్నంతవరకు నే చేసిన వెధవపనులు ముందే చెప్పేస్తా-అక్కడవాళ్ళకి అందుకే నేనంటే కొద్దిగా ప్రేమ కూడానూ- ముందే చెప్పేస్తే కఠిన శిక్షలు కొద్దిగా తగ్గిస్తారు-ఇది ఇంకో రహస్యం- రాసుకుంటూ ఉండండి- చదివేయడం కాదు.

చాలామంది యమపురిలో ఎక్కువ ఉండటానికి కారణం ఏమిటంటే- వాళ్ళు చేసినా పాపాలతో పాటు, అక్కడ బాధలు, నరకయాతనలు, శిక్షలు పడలేక యముణ్ణి కొద్దిగా విశ్రాంతి అడుగుతారు-అక్కడా ఆ సౌలభ్యం ఉంది,ఇక్కడ మనం "క్యాజువల్ లీవ్", "యాన్యువల్ లీవ్" తీసుకుంటాంగా- "పండగ సెలవులతో బాటు"-అలాగే యముడు వీళ్ళకి అలాంటి దీర్ఘకాలిక సెలవలు మంజూరు చేస్తాడన్నమాట. మనం అనుకునేంత కఠిన హృదయుడు కాదు,అలా అని మన సినిమావాళ్లు చూపించే వెర్రి వెంగళప్పా కాదు యమధర్మరాజు.

ఇదిగో, ఇలా మధ్యలో శిక్షలు అనుభవించడం మానేయడంవల్ల- అదే, సెలవలు తీసుకోవడం వల్ల చాలామంది చాలాకాలం అక్కడే ఉండిపోతారు.నా వరకు నేనైతే గబగబా తీసుకోవాల్సినవి తీసుకుని, స్వర్గానికి నేనే వెళిపోతా. దారి తెలిసినవాణ్ణి అవడంతో యమభటులు ఎవరూ తోడు రారు, వాళ్ళే అంటారు- "నీకు దోవ తెల్సుగా వెళ్ళవయ్యా- మాకు ఓ పని అన్నా తగ్గుతుంది" అని.ఇదిగో ఇలాంటివి చేయడం వల్ల వీళ్ళకి కాస్త నేను గుర్తు కూడాను- రెగ్యులర్ పాసెంజర్ లాగా-టక్కున గుర్తుపట్టేస్తారు యమపురిలో అందరూనూ (ఇదిగో ఇంకో కిటుకు కూడా చెప్పేసాను)

ఈ విషయంలో మీ అందరికీ కొన్ని అనుమానాలు రావచ్చు!
తిన్నగా స్వర్గానికి వెళ్ళేవాళ్ళని తీసుకెళ్లడానికి యమభటులు ఎందుకు వస్తారు- స్వర్గపు భటులు ఎందుకు రారు అని-నేను క్లారిటీ ఇస్తా! ఎంత పెద్ద "తోపుగాడు- తోపుగాడిది" అయినా చిన్నో చితకో పాపకార్యం చేయకుండా ఉండరు కదా-తెలిసో తెలియకో.అది ఒక కారణం, మరోది చిత్రగుప్తుడు ప్రతి ఒక్కడి చిట్టా చూసి-లెక్కలు చూసి వీళ్ళ పాపాల లిస్ట్ ఏమీ లేకపోతే టిక్కు పెట్టుకొని అప్పుడు స్వర్గానికి పంపిస్తాడు.అక్కణ్ణుంచి మాత్రం స్వర్గలోకపు భటులు ఉంటారు వాళ్ళు తీసుకెళ్తారు వీళ్ళని;స్వర్గానికి- నరకానికి చిత్రగుప్తుడు "సింగల్ విండో అధికారి" లాంటివాడు.

"డైలీ షటిల్ సర్వీసెస్" ఉంటాయి- "యమపురినుంచి స్వర్గానికి" వీళ్ళకి పెద్ద పనివత్తిడి ఉండదనుకోండి-పుణ్యాత్ములు తక్కువేగా ఈ కలికాలంలో భూమిమీద! ఒక్కోసారి స్వర్గపురి భటులు రోజంతా ఖాళీగా ఉంటారు వచ్చే పుణ్యాత్ములు లేక. యమభటులు కొంతమంది పైరవీకూడా చేస్తుంటారు - స్వర్గలోకంలో పనికి మారిపోవడానికి-చిత్రగుప్తుడికి తెలియకుండా; వాళ్ళకీ విసుగేగా రోజూ అదే నరకయాతనలు పెట్టడం భూలోకవాసులకు!

అలా అని స్వర్గపుభటులు లేరని కాదు, భూలోకంలో ఉన్న "మహానుభావులు, కారణజన్ములు" వాళ్ళు భూగ్రహానికి ఏతెంచిన పని పూర్తయిన తర్వాత-వీళ్ళని తీసుకెళ్లడానికి- ఇంద్రలోకం నుంచి ప్రత్యేక దూతలు వీళ్ళని తిన్నగా స్వర్గలోకానికి తీసుకెళ్లడానికి వస్తారు.ఇలాంటి ప్రత్యేకమైన వ్యక్తుల విషయంలో యమపురికి ఏ మాత్రం పని లేదు, కల్పించుకోవడానికి అవకాశమే లేదు; దేశప్రధానమంత్రి నుంచి తిన్నగా ఆదేశాలు వచ్చినట్టే.

పండగల విషయానికి వస్తే -మనమంటే భూలోకంలో ముక్కోటి దేవతల్ని తల్చుకుంటూ పూజలు చేస్తాం, పండుగలు జరుపుకుంటాం.మరి వాళ్లంతా అక్కడే ఉంటారు కదా-నా ఉద్దేశం యమపురి లోకాదు, పక్కనే ఉన్న స్వర్గంలో కొంతమంది, ఇంకొంతమంది ఎవరి ఇళ్లల్లో వాళ్ళు.

త్రిమూర్తులైతే ఎవరి లోకాల్లో వాళ్ళూనూ, వీళ్ళందరికీ పండుగలు ఎవరు చేస్తారు- వాళ్లకి వాళ్ళు చేసుకుంటే బాగుండదుగా. మహా అయితే త్రిమూర్తులకు మాత్రం ఈ దేవతలు గుంపుగా వెళ్లి దండాలు పెట్టి, వాళ్ళ దీవెనలు తీసుకుని ఇళ్ళకొచ్చి పండుగ చేసుకుంటారు.వీళ్ళకి ప్రత్యేకమైన సెలవలు అంటూ ఉండవు- వీళ్లకు రోజూ చేసే పనులేవీ ఉండవు కదా-పనిచేయడం, కష్టపడటం, సంపాదించటం లాంటివి-అంచేత రోజూ సెలవ కిందే లెక్క.

ఏదో రోజూ తినాలి కాబట్టి తింటారు గానీ,వీళ్ళకి ఆకలి దప్పులు ఉండవుగా; సంపాదించా అక్కర్లేదు,ఖర్చూ లేదు-మనం ఇక్కడపెట్టే నైవేద్యాలతో వాళ్ళ కడుపులు నిండిపోతాయి-పైగా రకరకాల పిండివంటలు, ఒక్కోసారి వాళ్లకి ఇష్టం అని ప్రత్యేకమైన వంటకాలు కూడా  చేస్తామాయే మరి- అది కూడా ఓ కారణం అయిండొచ్చు.

ఇంకో సందేహం కూడా మీకు రావచ్చు- మానవ శరీరం వదిలేసి కదా మనం ప్రయాణ అయ్యేది, మరి అక్కడ యమభటులు నానా నరకయాతనలు ఎలా పెడ్తారు మన "ఆత్మకి" అని.మనం పురాణాల్లో చదవలా "యాతనా శరీరం" అని మనకు బాధలు తెలిసేట్టుగా మనకు అక్కడ ఓ శరీరం వస్తుంది-మనం స్నానం చేసినతర్వాత డ్రెస్ మార్చుకున్నట్టు.

అదిగో ఆ యాతనా శరీరం వల్ల మనల్ని వాళ్ళు ఇష్టం వచ్చినట్టు ఆడుకుంటారు-శిక్షలతో,మనం ఇక్కడ జనాలతో ఇష్టం వచ్చిన రీతిలో మెలిగినట్టు. "నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి అన్నట్టు" మనం ఇక్కడ అవతలవాళ్ళకి చేసిందే మనకు అక్కడ చేస్తారన్నమాట (నే చెప్పే రహస్యాలతో పాటు ఇది కూడా గుర్తుపెట్టుకోండి)

ఇంకో విషయం చెప్పాలి మీకు- అక్కడ "పుణ్యలోకం" అని ప్రత్యేకంగా ఉంటుంది- మిక్కిలి పుణ్యం చేసినవాళ్లు ఆ లోకంలో ఉంటారు-వాళ్లకు విసుగు పుట్టేంతవరకు అక్కడ ఉండచ్చు.ఇక్కడ భూలోకంలో మంచివాళ్ళ అవసరం పడినప్పుడు వీళ్ళని వివిధ రూపాల్లో బ్రహ్మగారు ఈ "మహానుభావుల్ని" పంపిస్తూ ఉంటారు.వాళ్ళు వచ్చిన కార్యం అయిపోయిన తర్వాత మళ్ళీ పుణ్యలోకాలకు వెళ్ళిపోతారు.

ఇంకొందరు పరమాత్మలో ఐక్యం అయిపోతారు ఈ బాదరబందీ అక్కర్లేదు అనుకుంటే- లేదూ దేవతాగణాల్లో కలిసి ఉండచ్చు; ఇది "పూర్తిగా ఐచ్ఛికం" బలవంతం అంటూ ఉండదు!

నా వరకు మాత్రం విసుగూ విరామం లేకుండా ఇలా రాకపోకలు చేయాలనే కొరికే వ్యక్తం చేసాను పెద్దాయనతో.పెద్దాయన కూడా నవ్వుతూ అన్నాడు "అదేమిట్రా అబ్బీ,ఇక్కడ స్థిరంగా ఓ చోట కూర్చోక ఈ తిరుగుడు ఎందుకు" అని.

"ఇక్కడే   తిష్ట వేసుకు కూర్చుంటే విసుగ్గా ఉంటుందని- ఇక్కడకు వచ్చి ఈ గ్రహంలో మానవులు ఎప్పటికప్పుడు సాధించే విషయాలు, విజయాలు తెలుస్తుంటాయి-నా వారకు నా వంతుగా ఏదైనా చేస్తూ ఉండచ్చు అని చెప్పాను నేను చెప్పిన సమాధానం విని "బాగుందిరా, అలాక్కానీ" అన్నాడు నవ్వుతూ,

ఏదో పాపం చేసేవాళ్ల గురించి మొదలు పెట్టి మీకు తెలియని విషయాలు చాలా చెప్పేసినట్టున్నాను- ఇలాగె టచ్ లో ఉంటూ ఉండండి- అప్ డేట్ చేస్తూ ఉంటాను-ఎప్పటికప్పుడు!

ఇప్పటికింతే

# సోషల్ మీడియాలో బతికేయడం

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అదే లోకంలో బతికేవాళ్ళగురించి ఎంత రాసినా తక్కువే!
రకరకాల సామాజిక మాధ్యమాలు ఉపయోగపడేవి, మేలుచేసేవే-కొంత కాలక్షేపం దొరికినా "అతి సర్వత్ర వర్జయేత్" అని మన ఆర్యోక్తి ఉండనే ఉంది- చిన్నప్పటినుంచి వింటూనే ఉన్నాం.ఇదేదో సంస్కృత శ్లోకం కాబట్టి ఏదో కొద్దిమందికే ఉద్దేశింపబడినది కాదు,వాళ్ళకే పరిమితమయినది కాదు-యావత్ ప్రాణి కోటికి వర్తించేదే- కులాలకి మతాలకి అతీతంగా!

ఏదైనా సరే పరిమితిలో,మితంగానే ఉండాలి-తిండైనా బట్టయినా, మాటైనా, ఆటైనా. అలాగే ఈ సామాజిక మాధ్యమాలు కూడా!

వివిధ సామాజిక మాధ్యమాల్లో రాతలు, ఫోటోలు, వ్యాఖ్యలు- ఇష్టాలకు ఒక్క బటన్ నొక్కటం, ఇంకా ఇష్టం అయితే ఈమోజీ మొహాలు ("రామోజీ కాదు") ఓ రెండో మూడో- మన మూడును బట్టి (ఇంగ్లీష్ మూడ్) ఇంకా ఇష్టం ఉండి తీరిక ఉంటే ఓ నాలుగు ముక్కలు గబగబా గీకి పడేస్తాం - ఇవి మాత్రం అదిరిపోయేట్టు ఉంటాయి అన్నీ విశేషణాలే (అడ్జెక్టివ్స్) దీనికేం తక్కువలేదు!

ఈ ప్రక్రియ కొంత నిత్యకృత్యంగా (రుటీన్ గా) చేసేవాళ్ళు కొందరు- ఏ భావం లేకుండా అవతలవాళ్ళు ఏమైనా అనుకుంటారేమోనని, లేదా వాళ్ళ మనసు మెప్పించటానికి చేసేవాళ్ళు మరి కొందరు.మరి కొందరు మాత్రం నిజాయితీగానే "ఇష్టం బొత్తామ్" నొక్కుతారు (లైక్ బటన్) సందర్భాన్నిబట్టి వాళ్ళ వ్యాఖ్యలను నిజాయితీగా రాయడంకూడా జరుగుతుంది.

ఇది నిత్య కృత్యం- అంతర్జాలంలో, సామాజికమాధ్యమాల్లోమనంవిహరించేటప్పుడు; ఇంత వరకూ బానే ఉంది.ఇక ఎప్పుడూ వీటిల్లోనే విహరించి "లైకులకు" ఆనందపడిపోతూ ప్రపంచం అంతా తనని ఇష్ట పడుతున్నట్టూ-ముఖ్యంగా ఫోటో పోజ్ లకు (ఫోటో షూట్ అనొచ్చనుకుంటా) ఎంతవరకు సమంజసం- ఈ విషయంలో ఆడా మగా అనే తేడా లేదు.ఆడవాళ్ళ పోస్ట్ లకు ఎక్కువ లైకులు రావడం సర్వసాధారణం అనుకోండి- అదీ ఆ లైకులు ఎక్కువగా కొట్టేది మగవాళ్ళే అనుకోండి- ఈ సంగతి "జుకర్బర్గ్" చెప్పాలా ఏంటి!

ఇక ఆడపిల్లలయితే చెప్పక్కర్లా - యుక్త వయస్కులు, మధ్య వయస్కులు కూడా - లైక్ కొట్టిన ప్రతీ వాళ్ళు తనంటే పడి చచ్చిపోతున్నారనే భావనలో బతికేస్తారు- అందరు ఆడవాళ్ళని అంటంలేదండీ నన్ను వాయించబోకండి-మీకూ తెలుసు ఇలాంటి వాళ్ళు మీ స్నేహితుల్లో కూడా ఉండచ్చు అని-అంత ఖచ్చితంగా కూడా చెప్పలేననుకోండి- ఏదో నా భావన మాత్రమే! లేకపోతే మీ ఫ్రెండ్స్ వచ్చి మీతో దెబ్బలాడొచ్చు- వాడెవడు "కోన్ కిస్కాగాడు" అని నామీద కోపం మీమీద చూపించి గయ్యిమనొచ్చు!

అందాన్ని మెచ్చుకోవడం, ఏదైనా వస్తువు బాగుంటే బాగుంది అనడం సహజం ఫోటోకు లైకులు కొట్టగానే- సామాజిక మాధ్యమాల్లో వాళ్ళు, మన వీధిలో వాళ్ళు, మన ఊళ్లోవాళ్ళు అందరూ "తనంటే పడిచస్తున్నారనే" భావన మాత్రం నిస్సందేహంగా మానసిక అపరిపక్వత, అభద్రతాభావం-ఓరకమైన జబ్బే-ఎంత తొందరగా డాక్టర్ కి చూపించుకుంటే అంతమంచిది- దీనికి వాక్సిన్ లేదు మరి!

అంచేత, ఇలాంటివాళ్ళు అర్జెంట్ గా సామాజిక మాధ్యమాల్లోంచి "లాగ్ అవుట్" అయి- మానసిక వైద్యుడికి ఓసారి చూపించుకుని మళ్ళీ "లాగ్ ఇన్" అవుతే బాగుంటుంది అని నాఉద్దేశం-మీరేమంటారు!

ఈ నా రాతలకి లైకులు, మీ కామెంట్లు పెట్టకపోయినా పర్వాలేదు, నేనేమీ బెంగపడను కూడా- రావు రమేష్ అన్నట్లు "వాళ్లకి కొద్దిగా చెప్పండర్రా" అని నాకు చెప్పినట్టు అనిపించింది, అంతే వీళ్ళగురించి రాసేశా!

"మనసున ఉన్నది, చెప్పాలనున్నది - మాటలు రావే ఎలా"అని పాటలో చెప్పింది "స్నేహ"-నేను మాత్రం నారాతల్లో రాసా- నేను గాయకుణ్ణి కాదుగా-"రాయకుణ్ణి" మాత్రమే!

ఇక వీళ్ళకి "చెప్పడం, చెప్పకపోవడం" మీ ఇష్టం- ఓవేళ చెప్పినా వాళ్ళు"వినడం-వినకపోవడం"వాళ్ళ ఇష్టం!

ఇంతటితో ఈ అధిక ప్రసంగం సమాప్తం-ఉంటానిక!

# అంతలో ఇంత తేడా -ఇలా అయిపోయాయి!!!

రోటి పచ్చళ్ళు – “మిక్సీ పచ్చళ్ళు” అయిపోయాయి!

గృహాల్లో వండుకునే పిండివంటలు- “స్వగృహ ఫుడ్స్” గా మారిపోయాయి!

“ఎలా ఉన్నారు” అనే ఆప్యాయతతో నిండిన పలకరింపులు “హాయ్ గా” మారిపోయాయి!

"వెళ్లొస్తాం- మళ్ళీ రండి" కాస్తా “బాయ్ గా” మారిపోయాయి!

అన్ని బంధుత్వాల పిలుపులు –“అంటీ-అంకుల్” గా మారిపోయాయి!

సర్, మేడం అని పిలిచే పిలుపులు కూడా “అంటీ-అంకుల్” గా రూపాంతరం చెందాయి!

పుట్టినరోజున శుభాకాంక్షలు మనం చెప్పడం బదులు వాట్సాప్ రాతలుగా  మారిపోయాయి!

ప్రత్యక్షంగా కలవడం కాస్తా “జూమ్ కాల్స్” కి మారిపోయాయి!

చీరలు కాస్తా “పంజాబీ డ్రెస్సులు”అయిపోయాయి!

లంగా -వోణీ, జాకెట్టు కాస్తా-“మిడ్డీ టాపులు” అయిపోయాయి!

గౌనులేమో “షార్ట్స్ స్కర్టు”లయిపోయాయి!

చడ్డీలు కాస్తా “లింగరీలు”గా కురచపడిపోయాయి!

అప్పటి నామోషీ నిక్కర్లు ఇప్పుడు “షార్ట్స్ గా” ఫాషన్ అయిపోయాయి!

చిరిగిన ప్యాంటు వేసుకునే పేదతనం కాస్తా ఇప్పుడు యువతకి
“గొప్పతనం” అయిపోయింది!

దాచుకోవటం కాస్తా "చూపించటం" అయిపోయాయి!

వెళ్లి తెచ్చుకునే సరుకులు -వాటికి కాళ్ళు వచ్చి అవే ఇంటికి "నడిచి" వస్తున్నాయి!

ఇంటినుంచి ఆర్డర్లు తీసుకోవడానికి అల్లావుద్దీన్ అద్భుత దీపంలాగా "సిరి" "అలెక్సా" లాంటివి వచ్చేసాయి!

ఒకప్పటి అనాగరికమైన చిరుతిళ్ళు,బండిమీద తిళ్ళు-దేశమంతటా ఫాషన్ పేరుతో "ట్రెండుగా" నడుస్తున్నాయి!

ఒకప్పటి పల్లెటూర్ల తిండ్లు ఇప్పుడు ప్యాకింగ్, పేర్లు మారి "హెల్తీ ఫుడ్స్ గా"
పి/కొలవబడుతున్నాయి!

పూర్వం రాజులు కాలు కిందపెట్టకుండా దర్జాగా బతికేవారుట-"యాపుల ధర్మమా" అని అందరం రాజులుగా మారిపోయాము!

వంటఇంటి కర్రీలు "కర్రీ పాయింట్స్" లోకి మారిపోయాయి!

ఇంట్లో ఉండి నీతివాక్యాలు, మంచిమాటలు చెప్పే ముదుసలులను "వృద్ధాశ్రమాలకు" తరలిస్తున్నారు!

సప్తసముద్రాల అవతలకి వెళ్ళినవాళ్ళు వలసపక్షుల్లాగా వచ్చిపోతున్నారు- రాబోయే రోజుల్లో ఇళ్ళే వృద్ధాశ్రమాలుగా మారబోతున్నాయి!

ఇన్ని మారుతుంటే వీళ్ళు మారలేరా- లేరని ఎవరన్నారు!

అయినా సరే మనిషి జీవనగమనం సాగుతూనే ఉంది- పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, తనను తాను మార్చుకుంటూ!

భావితరాలను అర్థం చేసుకుంటూ- తన భవిష్యద్దర్శనం చేసుకుంటూ-ఓదార్పు, సానుభూతికోసం ఎదురు చూడకుండా!

# టెట్రా ప్యాక్

పాలు-పండ్ల రసాలు లాంటివి టెట్రా ప్యాక్ లో ఎప్పటినుంచో వస్తున్నాయి; కొనుక్కోవడానికి, తీసుకెళ్లడానికి, సులభంగా ఉంటుంది.ఇప్పుడు మద్యం కూడా టెట్రా ప్యాక్ లో వస్తున్నట్టుఉంది, ఎప్పుడో వచ్చి ఉండచ్చు.నేను మాత్రం నిన్న మా క్వార్టర్స్ ఆవరణలో ఓచోట పడిఉంటే చూసా"ఓల్డ్ మాంక్"-నా ఈవెనింగ్ వాక్ లో!

దేశానికి తాగుబోతుల వల్ల మంచి ఆదాయం వస్తోంది అని ఆమధ్య సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా జోకులు చూసాం- మరీ ముఖ్యంగా పాండెమిక్ సమయంలో.లాక్ డౌన్ అనౌన్స్ చేరిన ప్రతిసారి విపరీతమైన క్యూలు- ఆడవాళ్ళతో సహా (లేచింది మహిళాలోకం అన్నట్టుగా-నేనేం తప్పు పట్టడం లేదు)రెండు నెలలుగా దేశమంతా మళ్ళీ లాక్ డౌన్ ఉత్సవాలు చేసుకుంటున్నాంగా. మళ్ళీ అలాంటి వార్తలు,వీడియోలు విపరీతంగా వస్తున్నాయి"వాట్సాప్ విద్యాలయం" విద్యార్థుల ద్వారా!

ఈ టెట్రా ప్యాక్ పధకం-వాటి అమ్మకాలు మరింత జోరుగా సాగొచ్చేమో;ఎక్కడికైనా జేబులో పెట్టుకుని వెళ్ళచ్చు మొబైల్ లాగా.ఆదాయానికి ఆదాయం ప్రభుత్వాలకి- మందుబాబులు కిక్కు మిస్ అవకుండా వుంటారు లాక్ డౌన్ లో కూడా.

ఏదో ఫ్రూటీనో, పాల పాకెట్టో టెట్రా ప్యాక్ లో అలవాటుగాని (నిల్వవుండే పాలు టెట్రా ప్యాక్ లో వచ్చినరోజుల్లో మా అమ్మ అంటుండేది- రోజూ పాలుపోసే "చెన్నయ్య" నాగా పెడితే- "షాపుకెళ్ళి ఆ ప్రమాదం పాలప్యాకెట్ పట్టుకురా" అని- ఆవిడ ఉద్దేశంలో- ఎమర్జెన్సీలో అని) ఇది మాత్రం మంచి ఐడియానే ప్రస్తుత పరిస్థితుల్లో!

దేశ ఆర్థిక వ్యవస్థకి వెన్నెముకలాయె ఈ మందు బాబులు.వాళ్ళ అవసరాలు ఆరోగ్యం కూడా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేగా - వాక్సిన్, ఆక్సిజన్ తో బాటుగా.ఎంచేతంటే వాళ్ళ ఆరోగ్యం పాడవుతున్నా లెక్కచేయక,వాళ్ళ ప్రాణాలొడ్డి దేశ ఆరోగ్యం, భవిష్యత్తు కోసం కృషి చేస్తుంటారు కాబట్టి-ఇదే ఆక్సిజన్ వాళ్లకి; మందుబాబులకు ఆక్సిజన్ అందిస్తేనే ప్రభుత్వాలకి ఆక్సిజన్; మందుబాబులకు టెట్రా ప్యాక్ లకి కూడా జోహార్లు!

టెట్రా ప్యాక్ ఎప్పుడో వస్తే వీడేంటి "దొంగలు పడ్డ ఆర్నెల్లకి కుక్కలు మొరిగినట్టు" ఇప్పుడు దాని ముచ్చట్లు పెట్టాడు అనుకోవచ్చు - మందుబాబులు అభిమానంతో అవమానిపడి.ఏం చేస్తా గుండ్రాలు పుచ్చుకునే అలవాటు లేకపోయినా, గుండ్రాలు పుచ్చుకునే ఫ్రెండ్స్ ఉన్నారు.చాలాకాలంగా- మరీ ముఖ్యంగా రిటైర్ అయిన తరువాత- ఆ అవకాశం లేకుండా పోయింది.దాంతో బొత్తిగా మందుమీద జ్ఞానం (అనొచ్చా) పూర్తిగా పోయింది.

ఇదో, ఈ వైరస్ గొడవ పోతే గుండ్రాలు పుచ్చుకునే స్నేహితులను కలవాలి- వాళ్ళు గుండ్రాలు పుచ్చుకుంటూ ఉంటూ నాలాంటి "నాన్ స్పిరిట్యుయల్ సోల్ కి" సందడే సందడి మరి- వాళ్ళు చేసే సందడికి- చాలా మిస్ అవుతున్నా ఈ వైరస్ వల్ల (ఏవిటో బొత్తిగా స్పిరిట్యుయాలిటీ లేని బతుకయిపోయింది-జీవితాన్ని వేస్ట్ చేసినట్టున్నాను- సరే అలాక్కానిద్దాం ఈసారికి)

**వెధవది ఈ టెట్రా ప్యాక్ చూడగానే గుండ్రాలు గుండ్రాలుగా-పాత జ్ఞాపకాలు తన్నుకొస్తున్నాయి (అందుకని వెధవది అనకూడదేమో ఈ సందర్భంలో)**

**(లాక్ డౌన్ కదా- ముందు జాగ్రత్తగా స్టాక్ పెట్టుకున్నవాళ్ళు గుండ్రాలు  పుచ్చుకోండి-ఒంటరిగానే)**